తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

శనివారం
07 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :



సెంట్ మేరీస్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం అభినందనీయం

విద్యార్థులు రూపొందించిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించిన మంత్రి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 6 (జనం సాక్షి):

సెంట్ మేరీస్ ఇన్‌స్టిట్యూట్ పరిధిలోని రిహాబిలిటేషన్ సెంటర్‌ను రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సందర్శించారు. మధ్యాహ్నం హెలికాప్టర్ ద్వారా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి, సంస్థ ప్రతినిధులు మరియు న్యూరోలాజిస్టులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రిహాబిలిటేషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వివిధ ల్యాబ్‌లు, ఉపయోగిస్తున్న పరికరాలు మరియు అక్కడ అనుసరిస్తున్న ఆధునిక వైద్య విధానాలను మంత్రి నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ఉత్పత్తులు, వస్తువులను ఆయన ఆసక్తిగా తిలకించారు. ?ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మానవ సమాజానికి ఎంతో అవసరమైన ఇటువంటి అత్యాధునిక రిహాబిలిటేషన్ సెంటర్‌ను దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ తీర్చిదిద్దడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు. ?ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీరారెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్య, సెంట్ మేరీస్ ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకులు కేపీకే రావు, సీఈవో శ్రీహర్ష, సీసీవో ఇందిరా అపర్ణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై

యువతకు శిక్షణ

- భద్రాచలం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కార్యక్రమం ప్రారంభం
- డ్రోన్ సాంకేతికతతో రైతులకు సమయం, ఖర్చు ఆదా..
- ఐటీడీఏ పీవో బి. రాహుల్



భద్రాచలం నవంబర్ 06 (జనంసాక్షి) వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భద్రాచలంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో వ్యవసాయ డ్రోన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ద్వారా పంటలకు పురుగుమందులు, ఎరువులను తక్కువ సమయంలోనే వేగంగా పిచికారీ చేయవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల నీరు, మందుల వినియోగం తగ్గడంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు శ్రమ, సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పురుగుమందులతో ప్రత్యక్ష సంబంధం తగ్గి ఆరోగ్య భద్రతకు కూడా మేలు జరుగుతుందని వివరించారు. ఆధునిక డ్రోన్ సాంకేతికతపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీవో సూచించారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు భద్రాచలంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9441390232 నంబరును సంప్రదించాలని సూచించారు.



మురసు తుఫాన్ ప్రభావంతో

అశ్వారావుపేటలో భారీ నష్టం

- వెంకమ్మ చెరువు గండిని పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పంట నష్టం, రహదారుల మరమ్మతులపై తక్షణ నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

భద్రాద్రి కొత్తగూడెం, అశ్వారావుపేట నవంబర్ 6, (జనంసాక్షి)

మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట మండలంలో కురిసిన అత్యంత భారీ వర్షాలకు గండిపడిన వెంకమ్మ చెరువును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బాధిత రైతులకు జరిగిన పంట నష్టాన్ని, దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట ప్రాంతంలో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది.వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) సంభవించాయి. భారీ వరదల కారణంగా ఉద్యాన పంటలు, వరి పంటలు నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది.పలు ప్రాంతాల్లో రహదారులు వార్తా లోపలి పేజీలో

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం 100 శాతానికి చేరాలి

మార్చి నెలాఖరులోగా వీబీ - జి రామ్ జి ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యాన్ని సాధించాలి





భద్రాద్రి కొత్తగూడెం ,నవంబర్ 06(జనంసాక్షి):

వేసవి ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి.. లబ్ధిదారులకు ఉచిత ఇసుక, రాయితీ సిమెంట్ అందించాలి .విద్య, ఉపాధి హామీ, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరును మరింత మెరుగుపరచాలని, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, నిర్దేశిత లక్ష్యాల సాధనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ, ఎఈఖీంఓఉ, చేయూత పింఛన్ల వెరిఫికేషన్, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. వార్తా లోపలి పేజీలో

సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి : కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్-6 (జనంసాక్షి): దీపావళి పండుగను పర్యావరణహితంగా, సురక్షితంగా, సంతోషంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సందర్భంగా గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాణాసంచా కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలని, నైలాన్, పాలిస్టర్ వంటి సింథటిక్ దుస్తులు ధరించకూడదని సూచించారు. భవనాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా కాల్చాలని, టపాసులు కాల్చే ప్రదేశంలో ముందస్తుగా ఒక బకెట్ నీరు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా వారి పక్కనే ఉండి పర్యవేక్షించాలని, బాణాసంచాను జేబుల్లో పెట్టుకోవడం, చేతుల్లో పట్టుకుని తిరగడం చేయకూడదని కలెక్టర్ సూచించారు. వెలగని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదని, వాటిని నీటితో తడిపి సురక్షితంగా తొలగించాలని పేర్కొన్నారు. ఇళ్లలో, గ్యారేజీల్లో, బాల్కనీల్లో బాణాసంచా కాల్చకూడదని తెలిపారు.ప్రమిదలు, దీపాలను స్థిరమైన ప్రదేశాల్లో, కర్టెన్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర మండే వస్తువులకు దూరంగా ఉంచాలని, నిద్రించే ముందు లేదా బయటకు వెళ్లే ముందు వెలుగుతున్న దీపాలను ఆర్పివేయాలని సూచించారు. పెంపుడు జంతువులు, వీధి జంతువుల సమీపంలో పెద్ద శబ్దాలు వచ్చే బాణాసంచా కాల్చకూడదని తెలిపారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, ప్రమాదాలకు తావులేకుండా కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితమైన, ఆనందకరమైన దీపావళి పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

జనంసాక్షి

భద్రాచలం మార్కెట్ యార్డులో మోడల్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు

❍ రైతుల కోసం రూ.కోటి మంజూరు..
త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం..
❍ స్థలాన్ని పరిశీలించిన ఐటీడీఏ పీవో రాహుల్, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు..



భద్రాచలం నవంబర్ 06 (జనంసాక్షి)

భద్రాచలం ప్రాంత రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు మార్కెట్ యార్డులో అన్ని హంగులతో మోడల్ మార్కెట్ నిర్మించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసిందని, త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం భద్రాచలం మార్కెట్ యార్డులో మోడల్ మార్కెట్ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావుతో కలిసి ఆయన పరిశీలించారు. మార్కెట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి, రైతులకు అవసరమైన సదుపాయాల కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ భద్రాచలం పరిసర ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు ప్రధాన పంటలతోపాటు అంతర పంటలుగా సాగు చేస్తున్న కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలను నేరుగా మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయించుకునేలా మోడల్ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రైతులు, కొనుగోలుదారులకు అనుకూలంగా విక్రయాలు, కొనుగోళ్లు జరిగేలా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో ప్రభుత్వం మంజూరు చేసిన కోటి రూపాయలతో ఆధునిక సదుపాయాలతో మోడల్ మార్కెట్ నిర్మిస్తామని తెలిపారు. భద్రాచలం చుట్టుపక్కల మండలాల రైతులు తాము పండించిన కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయించుకోవచ్చన్నారు. తద్వారా దళారులపై ఆధారపడకుండా మెరుగైన ఆదాయం పొందడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ మధుకర్, విజయ్, టీఏ శ్రీనివాస్, ఈవో జీపీ శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేటలో భారీ నష్టం

తీవ్రంగా దెబ్బతిన్నాయి.పంట నష్టం, రహదారుల మరమ్మతులకు సంబంధించి పూర్తి వివరాలతో ఈరోజు సాయంత్రంలోగా నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం.తుఫాన్ వల్ల జరిగిన నష్టంపై సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అందజేస్తాం.ప్రతికూల వాతావరణంలోనూ పామాయిల్ సాగు రైతులకు భరోసాఅత్యంత భారీ వర్షాలు, వరదలు సంభవించి నప్పటికీ పామాయిల్ సాగుకు పెద్దగా నష్టం వాటిల్లకుండా పంట నిలబడటం విశేషమని మంత్రి పేర్కొన్నారు.అతివృష్టి, అనావృష్టి వంటి అసమతుల్య వాతావరణ పరిస్థితులు తరచూ ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో పామాయిల్ సాగు రైతాంగానికి ఒక వరంగా మారుతోందని ఈ పరిస్థితులు మరోసారి నిరూపించాయని మంత్రి తుమ్మల అన్నారు. రైతులకు అండగా నిలుస్తూ, పంట నష్టం అంచనా, రహదారుల పునరుద్ధరణ, దెబ్బతిన్న చెరువుల మరమ్మతుల పై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

మాదిగ జాగృతి సంఘం గుడిపల్లి మండల కమిటీ ఏర్పాటు

మండల కన్వీనర్‌గా మదారు శివ ఏకగ్రీవ ఎన్నిక



పి.ఏ.పల్లి, నవంబర్ 06(జనంసాక్షి):

మాదిగ సామాజిక వర్గ అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, సామాజిక చైతన్యమే లక్ష్యంగా మాదిగ జాగృతి సంఘం (ఎంజేఎస్) గుడిపల్లి మండల కమిటీని ఏర్పాటు చేశారు.దేవరకొండ మాదిగ జాగృతి సంఘం ఇన్‌చార్జి పెరిక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాదిగ జాగృతి సంఘం నల్గొండ జిల్లా నాయకులు సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతంతో పాటు మాదిగ సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా, హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలనే లక్ష్యంతో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.మండల కన్వీనర్‌గా మదారు శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కో-కన్వీనర్లుగా ఎర్ర శంకర్, మద్దిమడుగు ఆంజనేయులును నియమించారు.కమిటీ సభ్యులుగా పాల్వాయి రాకేష్,ఎర్ర యశ్వంత్,ఎర్ర అభి (శ్రీరామ్)లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గం విద్యా,రాజకీయ,ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఐక్యత,సంఘటిత పోరాటం ఎంతో అవసరమని అన్నారు.సామాజిక సమానత్వం,హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సంఘాన్ని విస్తరిస్తూ యువతలో సామాజిక చైతన్యం పెంపొందించే దిశగా నూతన కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు.

గుడిపల్లి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలి

ప్రభుత్వం వివక్ష చూపకుండా రైతుల ఇబ్బందులను గుర్తించాలిబిఆర్ఎస్ నాయకుడు ఎర్ర యాదగిరి



పి.ఏ.పల్లి,నవంబర్ 06 (జనంసాక్షి):

గుడిపల్లి మండలాన్ని ప్రభుత్వం తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకుడు,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి డిమాండ్ చేశారు.శుక్రవారం పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్‌రోడ్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడిపల్లి మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటిం చాలని కోరారు.కావాలనే కొందరు కక్షపూరితంగా వ్యవహరించి గుడిపల్లి మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చకుండా చేశారని ఆరోపించారు.పక్కనే ఉన్న పెద్దఅడిశర్లపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినప్పటికీ, గతంలో ఉమ్మడి మండలంగా ఉన్న గుడిపల్లిని విస్మరించడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని,గుడిపల్లి మండల రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుడిపల్లి మాజీ ఉపసర్పంచ్ కోమెర రాంబాబు,ఆదాసు రమేష్,బోడ నాగరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఐడీఓసీ కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం పెంచాలి

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను జనవరి మొదటి వారంలోగా 100 శాతం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద రూ.538 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు 10 శాతం కూడా ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 794 పీఎం శ్రీ పాఠశాలల్లో నిధుల వినియోగంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలపై కలెక్టర్లు దృష్టి సారించాలని తెలిపారు.


2026-27 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర శిక్ష, ఎఃఉఖీంఓఉ నిధులను సమన్వయంతో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫారాలు, కిట్లు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని ఆదేశించారు.

వేసవి ముగిసే వరకు తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా వేసవి ముగిసే వరకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి వారం సమావేశమై సరఫరా పరిస్థితిని సమీక్షించాలని తెలిపారు. చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులకు అవసరమైన మరమ్మతులు నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.మిషన్ భగీరథ పైప్‌లైన్లలో ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి వృథాను అరికట్టడంతో పాటు అక్రమ కనెక్షన్లు, ట్యాపింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎఃఉఖీంఓఉ పథకం ద్వారా నాణ్యమైన, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పనులు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని, మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్‌లో ఉన్న ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు కొత్త లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం 'మన ఇసుక ? మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఒక్కో సిమెంట్ బస్తాను రూ.230 చొప్పున లబ్ధిదారులకు సరఫరా చేయాలని, సబ్సిడీ ద్వారా లభించే ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీఓ మధు, హౌసింగ్ పీడీ సవేరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి శంభు ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి అనూష, అదనపు డీఆర్డీఓ రవి, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు... కంచె మరిచారు..!

- చండూరులో డివైడర్ మొక్కలకు ట్రీ గార్డులు కరువు..
- రోడ్ కాంట్రాక్టర్ వైఫల్యమా..? మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమా..?
- రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సిన బాధ్యతను విస్మరించి...
- మొక్కలను మేస్తున్నాయంటూ.. మూగజీవాలపై, వాటి యజమానులపై మున్సిపల్ అధికారుల ప్రతాపం..
- మూగజీవాలు మేయకుండా వెంటనే ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్న మున్సిపల్ ప్రజలు..



చండూరు, నవంబర్ 06 (జనంసాక్షి)

పట్టణ సుందరీకరణ, పచ్చదనం పెంపు పేరిట మొక్కలు నాటడమే తప్ప వాటి సంరక్షణను గాలికొదిలేయడం చండూరు మున్సిపల్ అధికారులకే చెల్లింది. రోడ్డు డివైడర్లలో వేల రూపాయల ప్రజాధనం వెచ్చించి మొక్కలైతే నాటారు కానీ, వాటికి రక్షణగా ట్రీ గార్డులు (కంచె) ఏర్పాటు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నల్గొండ జిల్లా చండూరు మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంటున్న ఈ వ్యవహారంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీలోనైనా రోడ్డు డివైడర్ల మధ్య మొక్కలు నాటితే, మూగజీవాలు మేయకుండా వెంటనే ఇనుప లేదా ప్లాస్టిక్ ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం నిబంధన. అయితే చండూరు మున్సిపాలిటీలో మాత్రం ఈ ప్రాథమిక బాధ్యతను పూర్తిగా విస్మరించారు. డివైడర్లలో పచ్చటి మొక్కలు నాటి చేతులు దులుపుకోవడంతో, రోడ్లపై తిరిగే ఆవులు, మేకలు, ఇతర మూగజీవాలు ఆ మొక్కలను తినేస్తున్నాయి. రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సిన అధికారులు... మొక్కలను మేస్తున్నాయంటూ.. మూగజీవాలపై, వాటి యజమానులపై ప్రతాపం చూపడం విడ్డూరంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు.రక్షణ కంచె లేకుండా రోడ్డు మధ్యలో మొక్కలు నాటితే మూగజీవాలు కాక ఇంకేం తింటాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు ట్రీ గార్డుల ఏర్పాటు కాంట్రాక్ట్ ఎవరికిచ్చారు..? నిధులు కేటాయించినా కంచె ఎందుకు ఏర్పాటు చేయలేదు.? ఇది గుత్తేదారు వైఫల్యమా.. లేక పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారుల లోపమా.. అని పట్టణవాసులు నిలదీస్తున్నారు. వర్షాకాలం పూర్తయి ఎండలు ముదురుతున్న వేళ, ఇప్పటికైనా మొక్కలు ఎండిపోకముందే, పశువుల పాలు కాకముందే స్పందించి వెంటనే డివైడర్లలోని మొక్కలకు పటిష్టమైన ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని చండూరు మున్సిపల్ ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



మండలంలోని మూడు పాఠశాలల్లో లిజనింగ్ టు చిల్డ్రన్ కార్యక్రమం

పిల్లల మనసులోని మాటకు వేదిక

- సంతోషకర,బాధకర అనుభవాలపై విద్యార్థుల నుంచి అభిప్రాయాల సేకరణ

- మూడు పాఠశాలల్లో లిజనింగ్ టు చిల్డ్రన్ కార్యక్రమం

- 136 మంది విద్యార్థుల భాగస్వామ్యం

చింతలపాలెం(జనంసాక్షి)

పిల్లల మనసులోని భావాలు, సమస్యలు,ఆందోళనలను తెలుసుకునేందుకు లిజనింగ్ టు చిల్డ్రన్ కార్యక్రమాన్ని శుక్రవారం చింతలపాలెం మండలంలోని మూడు గ్రామాల్లో నిర్వహించారు. చింతలపాలెం జడ్పీహెచ్ఎస్, దొండపాడు,గుడిమల్కాపురం ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తమ జీవితాల్లో చోటుచేసుకున్న సంతోషకరమైన, బాధాకరమైన సంఘటనల గురించి వారితో రాయించారు.తమ అనుభవాలు,అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేలా అవకాశం కల్పించారు.గుడిమల్కాపురం ప్రభుత్వ పాఠశాలలో గ్రామ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యా యుడు, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి,ఆశా కార్యకర్త పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. దొండపాడు హైస్కూల్‌లోనూ విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.అక్కడ సీహెచ్. ప్రశాంతి, గ్రామ కార్యదర్శి సైదులు,సీఆర్‌పీలు, పాఠశాల హెచ్ఎం,అంగన్‌వాడీ టీచర్లు ఎస్‌కే మస్తాన్‌బీ,సరిత,శైలజ పాల్గొన్నారు.కొత్తగూడెం గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్,సీఆర్‌పీ నాగయ్య కూడా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్ర మంలో దొండపాడు పాఠశాలలో 60 మంది,చింతలపాలెంలో 60 మంది, గుడిమల్కాపురంలో 16 మంది కలిపి మొత్తం 136 మంది విద్యార్థు లు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశా ల మేరకు నిర్వహించిన ఈ కార్యక్ర మంలో సేకరించిన అభిప్రాయాలు జిల్లా బాలల రక్షణ,సురక్షిత పేరెంటింగ్ ప్రణాళిక రూపకల్పనకు ఉపయోగపడనున్నాయి.

భూమి రీసర్వేకు రైతులు సహకరించాలి

జాజిరెడ్డిగూడెం(జనం సాక్షి):

భూమి రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ కోరారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతి కార్యాలయంలో భూమి రీసర్వేపై జరిగిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. రీసర్వేకు సంబంధించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లు బింగి కృష్ణమూర్తి, చిల్లంచర్ల విద్యాసాగర్, గిర్దావర్ ప్రసన్న, జీపీఓ అజయ్, సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచులు కమటం స్వర్ణలతరాజు, మామిడి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అర్వపల్లి ఆలయం : ఆర్డీఓ

జాజిరెడ్డిగూడెం(జనంసాక్షి):

అర్వపల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని సూర్యాపేట ఆర్డీఓ ఆర్.వేణుమాధవరావు అన్నారు. శుక్రవారం స్థానిక దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బీరవోలు విక్రంరెడ్డి, తహసీల్దార్ బి.శ్రీకాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి , శిగ నసీర్, సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, పూర్ణచంద్రారెడ్డి, నవీన్, రవి, చింటూ పాల్గొన్నారు.

ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసిన మునుగోడు ఎన్నికల కన్వీనర్ పబ్బు రాజు గౌడ్

దీపావళి పండుగ శుభాకాంక్షలతో పాటు కానుక అందజేత

చౌటుప్పల్ నవంబర్ 6(జనంసాక్షి)

మునుగోడు నియోజకవర్గ ఎన్నికల కన్వీనర్ పబ్బు రాజు గౌడ్ శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలో శాసనమండలి సభ్యులు(ఎమ్మెల్సీ) నెల్లికంటి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు.దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంకు పబ్బు రాజు గౌడ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక దీపావళి కానుకను అందజేసి శాలువాతో సత్కరించారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, స్థానిక ప్రజల సమస్యలు, నియోజకవర్గ ప్రగతికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు సానుకూలంగా చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీవ్ వికాసంపై నిద్రమత్తు వదలని యంత్రాంగం

తక్షణమే అమలు చేయాలి: చెరుకుపల్లి సైదులు

మాడుగులపల్లి నవంబర్ 6 (జనం సాక్షి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ వికాసం పథకం క్షేత్రస్థాయిలో నాన్చివేత ధోరణికి నిదర్శనంగా మారిందని ఎమ్మార్పీఎస్ మాడుగులపల్లి మండల అధికార ప్రతినిధి చెరుకుపల్లి సైదులు స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రభుత్వ పిలుపు మేరకు పథకం ద్వారా లబ్ధి పొందేందుకు నిరుద్యోగులు, అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకుని ఆశగా ఎదురుచూస్తున్నారని, కానీ అప్లై చేసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు పథకం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో చెప్పే నాథుడే కరువయ్యాడని ధ్వజమెత్తారు మండల స్థాయిలో ఉన్న ఏ అధికారిని అడిగినా మాకేమీ తెలియదు అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానాలు దాటవేస్తూ ప్రజలను తీవ్ర అయోమయానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులను ఈ పథకం పురోగతిపై ప్రశ్నిస్తే,మాకు దాని గురించి ఎలాంటి సమాచారం లేదు అని తప్పించుకునే ధోరణి ప్రదర్శించడం శోచనీయమన్నారు అధికారుల, ప్రజాప్రతినిధుల ఈ నిర్లక్ష్య వైఖరి వల్ల అర్హులైన లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు

ఇప్పటికైనా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు పథకం అమలుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసి, రాజీవ్ వికాసాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాలని కోరారు లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



జనంసాక్షి

చౌటుప్పల్‌లో జాతీయ రహదారి పనులతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



చౌటుప్పల్, నవంబర్ 06 (జనంసాక్షి)

హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఎదురవుతున్న తీవ్ర ట్రాఫిక్ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ పనుల కారణంగా నిత్యం వేలాది వాహనాలు నిలిచిపోతుండటంతో వాహనదారులు, పట్టణ ప్రజలు, స్థానిక వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు స్వయంగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారు స్థానిక పోలీసు అధికారులతో సమావేశమై ట్రాఫిక్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో తగినన్ని హెచ్చరికా బోర్డులు ఏర్పాటు చేయాలని, పీక్ అవర్స్‌లో అదనపు సిబ్బందిని నియమించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రజలకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని, అలాగే సర్వీస్ రోడ్లను గుంతలు లేకుండా మరమ్మతు చేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, పిఏఎస్సి చైర్మన్ మస్తాన్ బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, బొబ్బిళ్ళ రాజేందర్, బత్తుల శ్రీహరి, సీతారామచంద్ర ఆలయ చైర్మన్ బొబ్బిలి మురళి, సర్పంచ్ జ్యువి నరసింహ, బొంగు జంగయ్య గౌడ్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు బాబా షరీఫ్, పస్తం గంగారాములు, జంగయ్య, కిరణ్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పి.ఏ.పల్లి మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష,సామర్థ్య వృద్ధి సమావేశం



పి.ఏ.పల్లి,నవంబర్ 06(జనంసాక్షి):

పి.ఏ.పల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు ఈ నెల 7వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష మరియు సామర్థ్య వృద్ధి సమావేశం నిర్వహించనున్నట్లు పి.ఏ.పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా సంబంధిత మండల శాఖ అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి పూర్తి సమాచార పత్రములతో సకాలంలో హాజరు కావాలని కోరారు.



అనుముల మండలంలో విత్తన దుకాణాల తనిఖీ

ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి: వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత

అనుముల నవంబర్ 6 (జనంసాక్షి)

అనుముల మండలంలోని విత్తన డీలర్ల దుకాణాలను ఈరోజు హాలియా వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత (ఎడిఎ) తనిఖీ చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకుని రాబోయే కాలంలో నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, రైతులు వరి సాగుకు బదులుగా అనువైన ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను ఎంచుకోవాలని వారు సూచించారు.ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ, పెసర, మినుము, కంది, జొన్న వంటి తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటల నాణ్యమైన విత్తనాలను డీలర్లు ముందుగానే తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు తమ పొలాల్లో లభించే నీటి వనరులను పరిగణనలోకి తీసుకుని పంట ఎంపిక చేసుకోవాలని, నీటి ఆదా చేసే సాగు పద్ధతులపై ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. వెంకన్న వ్యవసాయ సహాయ సంచాలకులతో కలిసి పలు విత్తన డీలర్ల దుకాణాలను సందర్శించారు. విత్తనాల నాణ్యత, ధరల ప్రదర్శన, అమ్మకాల నమోదు వంటి అంశాలపై అధికారులు సమీక్షించారు. రైతులకు సరైన సలహా అందించడం ద్వారా వర్షాధార మార్పుల నుంచి వచ్చే నష్టాలను తగ్గించి, వ్యవసాయ ఉత్పత్తిని కొనసాగించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీఓ తనిఖీలు

వలిగొండ, నవంబర్ 6 (జనంసాక్షి)

మండలంలోని నాగారం, గోల్నెపల్లి, జాలుకల్వ, అర్రూర్, వేములకొండ గ్రామాల్లో ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఆర్థిక పరిస్థితులు, ఇంటి నిర్మాణాల పురోగతిని తెలుసుకొని, ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకొని పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, సమయపాలనపై ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

108 అత్యవసర సేవల తెలంగాణ రాష్ట్ర స్టేట్ హెడ్ అత్యవసర సేవల కార్యనిర్వహణ అధికారి సుధాకర్

హైదరాబాద్: నవంబర్ 06, (జనంసాక్షి)

దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, సురక్షితంగా జరుపుకోవాలని 108 అత్యవసర సేవల కార్యనిర్వహణ అధికారి సుధాకర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని, ఇళ్లకు దూరంగా విశాలమైన ప్రదేశాల్లో బాణసంచా కాల్చాలని తెలిపారు. కాటన్ దుస్తులు ధరించాలని, టపాసులు కాల్చే ప్రాంతంలో నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదవశాత్తు కాలిన గాయాలు ఏర్పడితే వెంటనే చల్లని నీటితో గాయమైన ప్రాంతాన్ని శుభ్రం చేయాలని, ఐస్ లేదా నూనె వంటి పదార్థాలు రాయకూడదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 108 అంబులెన్స్ సేవలను సంప్రదించాలని కోరారు.ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా 108 అత్యవసర అంబులెన్స్ సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాదాలకు దూరంగా ఉంటూ ఆనందంగా, ఆరోగ్యంగా, సురక్షితమైన దీపావళి జరుపుకోవాలని సుధాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అనుమతులు లేని ప్రీకాస్ట్ నిర్మాణాలు నిలిపివేయాలి

మండల రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్

కొండమల్లేపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి):



కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొలుముంతల పహాడ్ గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్ 185 లో గల వెంచర్ లో చేపడుతున్న ప్రీకాస్ట్ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని గ్రామ పంచాయతీ సూచనల మేరకు మండల రెవెన్యూ అధికారి ఓర్సు శ్రీనివాస్ వెంచర్ ను సందర్శించి ఆ వెంచర్ లో సంబంధిత అధికారుల అనుమతులు లేకుండానే ప్రీకాస్ట్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గ్రామ పంచాయతీ దృష్టికి వచ్చిందని ఆ వెంచర్ నిర్వహకుడు అడపాల శ్రీధర్ నిబంధనల ప్రకారం అనుమతులు పొందే వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని సంబంధిత వెంచర్ నిర్వాహకులకు సూచించారు. అనుమతులు పొందిన తర్వాతే పనులు ప్రారంభించాలని అనుమతులు లేకుండా పనులు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ శ్రీనివాస్ వెంచర్ నిర్వాహకులకు హెచ్చరించారు. నిబంధనలు పాటించి రెవెన్యూ పూర్తి అనుమతులు పొందాకే పనులు ప్రారంభించాలని వారు పేర్కొన్నారు.

అధైర్యపడకండి.. మీకు అండగా ఉంటా

తురక కాశల హక్కుల పోరాటంలో భాగస్వామినవుతా

రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి గళం విప్పుతా:ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సంస్థాన్ నారాయణపురం నవంబర్ 6 (జనంసాక్షి):

తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా గుడిమల్కాపూర్ గ్రామంలో చేపట్టిన జెండా గద్దె నిర్మాణాన్ని గ్రామ సర్పంచ్ అడ్డుకుంటున్నారని రాష్ట్ర అధ్యక్షుడు బడే సాబ్ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం స్పందిస్తూ.. తురక కాశ జెండా గద్దె నిర్మాణానికి ఎవరైనా అడ్డుపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. తురక కాశ నాయకులు అధైర్యపడవద్దని, ఈ విషయంలో తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తురక కాశల హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటంలో తాను కూడా భాగస్వామినవుతానని తెలిపారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తురక కాశలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు అంశాన్ని మరోసారి ప్రస్తావించి, తురక కాశల సమస్యలపై గళం విప్పుతానని హామీ ఇచ్చారు.





భద్రాచలంలో హోటళ్లు, రెస్టారెంట్లపై ఆహార భద్రతా శాఖ కొరడా

○11 రెస్టారెంట్ల లైసెన్సులు సస్పెండ్..

○565 కిలోల నాసిరకం ఆహార పదార్థాలు తొలగింపు..

భద్రాచలం నవంబర్ 06 (జనంసాక్షి)



ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని ఆహార భద్రతా శాఖ అధికారులు స్పష్టం చేశారు. భద్రాచలంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై టీజీ సేఫ్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమాలు, నాణ్యతా లోపాలను గుర్తించారు. ఈ తనిఖీల్లో నిబంధనలను ఉల్లంఘించిన 11 రెస్టారెంట్ల లైసెన్సులను సస్పెండ్ చేయగా, మరో నాలుగు రెస్టారెంట్లకు లోపాలను సరిదిద్దుకోవాలని నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా, వినియోగానికి అనర్హమైన, నాణ్యతా ప్రమాణాలు లేని 565 కిలోల ముడి ఆహార పదార్థాలను గుర్తించి తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా ఆహార భద్రతా నిబంధనలు పాటించాలని, వంటశాలలు, ఆహార నిల్వ ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గుర్తించిన లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకుని, తదుపరి తనిఖీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారణ అయిన తర్వాతే సస్పెండ్ చేసిన లైసెన్సుల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా తనిఖీలు కొనసాగుతాయని, ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

కేటీఆర్‌ను కలిసిన బాధితుడు వల్లబ్దాస్ చంద్రశేఖర్

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన

వివరాలు, ఆధారాలను న్యాయ విభాగంలో ఇవ్వాలని సూచించిన కేటీఆర్

మూడుగుల పల్లి నవంబర్ 6(జనంసాక్షి):

గత నెలలో వినాయక చవితి ఊరేగింపు సందర్భంగా ఇసుకబావిగూడెంలో తమపై జరిగిన భౌతిక దాడి, కుల దూషణల ఘటనపై తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను బాధితుడు వల్లబ్దాస్ చంద్రశేఖర్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గత బుధవారం నేరుగా కలిశారు గ్రామ ఉపసర్పంచ్ సంధ్య, ఆమె భర్త వల్లబ్దాస్ చంద్రశేఖర్‌పై దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదైనప్పటికీ, నిందితులపై ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆయన కేటీఆర్ వద్ద తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు ఘటన జరిగిన తీరును, పోలీసుల తీరును కేటీఆర్‌కు వివరించి తమ గోడును వెళ్లబోసుకున్నారు.బాధితుడి ఆవేదనను ఆలకించిన బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఈ ఘటనకు సంబంధించిన పత్రాలు, ఛాయాచిత్రాలు, దృశ్యరూప ఆధారాలు (వీడియోలు) ఏమైనా ఉంటే వాటిని వెంటనే తెలంగాణ భవన్‌లోని పార్టీ న్యాయ విభాగంలో (లీగల్ సెల్) అందజేసి వెళ్లాలని చంద్రశేఖర్‌కు సూచించినట్లు బాధితుడు తెలిపారు న్యాయపరంగా పరిశీలించి, బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.



నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రతిపాదనలు

నేరేడుచర్ల నవంబర్ 06 (జనంసాక్షి):



నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై పాలకమండలి సమావేశం లో కీలక నిర్ణయాలు, తీసుకున్నారు. శుక్రవారం నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ చలసాని స్పందన రాజీవ్ అధ్యక్షతన పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యాలయం లో నూతనంగా చైర్మన్ చాంబర్,సమావేశ మందిరం నిర్మాణంతోపాటు కార్యాలయ నిర్వహణకు అవసరమైన మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులకు పంపాలని తీర్మానించారు.అదేవిధంగా రైతులకు ఉపయోగపడేలా నాబార్డ్ గోదాం నిర్మాణానికి మరోసారి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. నాబార్డ్ గోదాం నిర్మాణం కోసం పాలకవీడు మండలం గుడిగుంట్లపాలెం గ్రామ పరిధిలో మూడు ఎకరాల స్థలం కేటాయించేలా సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపాలని సమావేశంలో తీర్మానించినట్లు చైర్మన్ స్పందన రాజీవ్ తెలిపారు.ఈ సమావేశంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకట్‌రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునగాల భాస్కర్‌రెడ్డి,పాలకమండలి సభ్యులు కర్ణం రామనరసయ్య,బుర్రి వెంకయ్య,సురోజు రవీంద్రచారి, ఊటుకూరు సైదులు,పల్లె కశయ్య,కత్తి శ్రీనివాసరెడ్డి, ధనావత్ సైదు,రామావత్ వశ్య నాయక్,చింతలచెర్వు ప్రియాంక,పోతురాజు జ్యోతి, రెబ్బా రమేష్,పోలా విశ్వనాథం,జిల్లా మార్కెటింగ్ అధికారి పి.దామోదర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సన్నీ,సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సర్పంచ్ (చైర్మన్) అధ్యక్షతనే నూతన ఇందిరమ్మ కమిటీలను నియమించాలి

చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం డిమాండ్

○చౌటుప్పల్ ఎంపీడీవో శ్రీమతి శ్రీలత కు సర్పంచుల వినతి పత్రం సమర్పణ

○పాత కమిటీలను రద్దు చేసి, సర్పంచులకు బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి

○ సమస్యలు పరిష్కరించక పోతే పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిక



చౌటుప్పల్, నవంబర్ 06 (జనంసాక్షి)

రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందు ఏర్పాటు చేసిన పాత ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేయాలని, పంచాయతీరాజ్ 2018 చట్టం ప్రకారం నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ (చైర్మన్) అధ్యక్షతన మాత్రమే గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు రెండో విడత సెలక్షన్ కమిటీలను ఏర్పాటు చేయాలని చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం డిమాండ్ చేసింది.శుక్రవారం చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్‌అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్పంచుల అత్యవసర సమావేశం జరిగింది. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీలత ను కలిసి, ప్రభుత్వానికి పంపవలసిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, సంక్షేమ బాధ్యతలు సర్పంచులపైనే ఉంటాయని, అందువల్ల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కమిటీకి సర్పంచే చైర్మన్‌గా వ్యవహరించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.సర్పంచుల హక్కులను, విధులను పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇదే విషయంపై గత మార్చి 17, 2026న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కు కూడా వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. ఎంపీడీవో ఈ వినతి పత్రాన్ని తక్షణమే ఉన్నతాధికారులకు పంపి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఒకవేళ సర్పంచుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే, భవిష్యత్తులో రాజకీయ పార్టీలకతీతంగా సర్పంచులందరం ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు:

ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో దండు మల్కాపురం సర్పంచ్ గిర్కంటి నిరంజన్ గౌడ్, కొయ్యలగూడెం సర్పంచ్ కైరం కొండ స్వప్న, అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల, మందోల్లగూడెం సర్పంచ్ తంగెళ్ల వెంకటేశం, పెద్ద కొండూరు సర్పంచ్ గుండెబోయిన శిరీష, కుంట్ల గూడెం సర్పంచ్ అన్నాలపు నరేష్, జై కేసారం సర్పంచ్ సమ్మిరెడ్డి భరతమ్మ,కాట్రేవ్ సర్పంచ్ బోయ మహేంద్ర మనీ, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మిసెస్ తెలంగాణ పోటీల్లో పల్లవి శ్రీవాస్తవకు ఫస్ట్ రన్నరప్ టైటిల్

హైదరాబాద్, నవంబర్ 6 (జనం సాక్షి):



మిసెస్ తెలంగాణ అందాల పోటీల్లో పల్లవి శ్రీవాస్తవ ఫస్ట్ రన్నరప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. తెలంగాణ స్పార్క్ ఆధ్వర్యంలో శ్రీ గౌస్ పాషా దర్శకత్వంలో నవంబర్ 1న నిర్వహించిన ఈ పోటీల్లో ఆమె ప్రతిభ చాటుకున్నారు.ఆత్మవిశ్వాసం, హుందాతనం, ఆకట్టుకునే వ్యక్తిత్వం, వేదికపై అద్భుత ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. మోడలింగ్ రంగంపై ఆసక్తి, పట్టుదలతో ముందుకు సాగుతున్న పల్లవి శ్రీవాస్తవకు ఈ విజయం ఒక మైలురాయిగా నిలవనుంది.ఈ సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

జనంసాక్షి

సమాజంలో ధర్మం, న్యాయం నిలబడేలా చేయడంలో జడ్జీల పాత్ర కీలకం

బార్ అసోసియేషన్ అధ్యక్షులు, జ్ఞాన సుందర్



తుంగతు ర్తి నవంబర్ 6 (జనం సాక్షి)

సమాజంలో ధర్మం, న్యాయం నిలబడేలా చేయడంలో జడ్జీల పాత్ర కీలకమని తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపర్తి జ్ఞాన సుందర్ అన్నారు శుక్రవారం మండల కేంద్రంలోని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న జడ్జి మొహమ్మద్ గౌస్ పాషా వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, ఈ మేరకు ఆయన మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో కోర్టులో జడ్జి గా సేవలందించడం అభినందనీయమని అన్నారు, చట్ట నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా తీర్పులు ఇవ్వడం ఎంతో బాధ్యతతో కూడుకున్న పని అని అన్నారు, న్యాయమే ధ్యేయంగా నిష్పక్షపాతంగా ఈ మారుమూల ప్రాంతంలో జడ్జిగా సేవలందించడం హర్షించదగ్గ విషయం అని అన్నారు, తుంగతుర్తి ప్రాంతంలో వారు అందించిన తీర్పులు న్యాయవ్యవస్థ పై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు, కేసుల విచారణలో చూపిన ఓర్పు, సమయపాలన, చట్టం పట్ల ఉన్న నిబద్ధత అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు, చట్టాన్ని మానవీయ కోణంలో సమస్యలను అర్థం చేసుకుంటూ వారు ఇచ్చిన తీర్పులు ఎంతో ప్రశంసనీయమని అన్నారు, సమాజంలో ధర్మం న్యాయం నిలబడేలా చేయడంలో జడ్జీల పాత్ర కీలకమన్నారు వారు చేసిన సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తూ బదిలీపై వెళుతున్న నూతన ప్రాంతంలో కూడా వారు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారి భవిష్యత్తు దిగ్విజయంగా కొనసాగాలని కోరారు ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు న్యాయపరంగా సేవలు అందించిన పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు తనకు న్యాయవాదులందరూ సమిష్టిగా న్యాయ ప్రక్రియలో తోడ్పాటు అందించారని అన్నారు,ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జడ్జి గౌస్ పాషాను ఘనంగా పూలమాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో బార అసోసియేషన్ సెక్రెటరీ హరిచరణ్, కారింగుల వెంకటేశ్వర్లు, కోశాధికారి బి సతీష్, వజీర్, శ్రీధర్ న్యాయవాదులు తాళ్ల పెళ్లి సత్యనారాయణ, బత్తిని వెంకటేశ్వర్లు, రణధీర్, న్యాయవాదులు వేణు రాజ్, నాగరాజు, సైదులు, జిలకర చంద్రమౌళి, గుగులోతు రాజారాం, తో పాటు కోర్టు సిబ్బంది సూపర్డెంట్ శ్రీనివాస్, పరిమళ, తేజస్విని, ఈశ్వరి, సుధాకర్, రాము సురేందర్, పుష్ప పాల్గొన్నారు



నిరుపయోగంగా మారిన కల్వలపాలెం గ్రామపంచాయతీ ట్యాంకర్!

అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం

ప్రజాధనం బుగ్గిపాలేనా-నిలదీస్తున్న గ్రామస్థులు

లక్షలాది ప్రజాధనం బుగ్గిపాలు ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి ట్యాంకరే సాక్ష్యం!

మాడుగులపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి):

నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కల్వలపాలెం గ్రామంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది ఓట్ల కోసం ఊదరగొట్టే నాయకులు, అభివృద్ధి జపం చేసే ప్రజాప్రతినిధులు గ్రామంలోని ప్రభుత్వ ఆస్తుల సంరక్షణను పూర్తిగా గాలికొదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి లక్షల రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్ సంరక్షణ కరువై, తుప్పు పట్టి మైదానంలో అనాథలా పడి ఉంది ట్యాంకర్ వెనుక భాగం పూర్తిగా పగిలి, పెద్ద రంధ్రం ఏర్పడి నిరుపయోగంగా మారినా గ్రామానికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు గానీ, పంచాయతీ కార్యదర్శి, అధికారులు గానీ కనీసం కన్నుతెరిచి చూడకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది హరితహారం మొక్కలకు నీళ్లు పోయడానికైనా, అత్యవసర వేళల్లో గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చడానికైనా ఉపయోగపడాల్సిన ఈ వాహనాన్ని కాపాడుకోలేని స్థితిలో నాయకులు ఉండటంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పదవులు అనుభవించడమే తప్ప ప్రజా సమస్యలు, ప్రభుత్వ ఆస్తుల రక్షణ పట్టదా అంటూ ప్రజలు ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు ఇప్పటికైనా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తు వీడి, జిల్లా ఉన్నతాధికారులు స్పందించేలా చూసి వెంటనే ఈ ట్యాంకర్‌కు మరమ్మతులు చేయించాలని లేదా కొత్త ట్యాంకర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కల్వలపాలెం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు దేవరకొండకు తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత రాక

డిండి ప్రాజెక్టు వద్ద కృష్ణా జలాల వినియోగంపై దృశ్య మాధ్యమం ఆవిష్కరణ



దేవరకొండ, నవంబర్ 06 (జనంసాక్షి):

తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత నేడు దేవరకొండ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పాలమూరు? రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కృష్ణా జలాలను నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, ఎండిపోతున్న పంటలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డిండి ప్రాజెక్టు వద్ద కృష్ణా జలాల వినియోగంపై రూపొందించిన సమగ్ర దృశ్య మాధ్యమాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం దేవరకొండ పట్టణంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఆల్ యూనివర్సిటీస్ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్‌సీఎల్ అశోక్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు పగిడిపాటి విక్రాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లకుమారపు మల్లయ్య, దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నేనావత్ శివ నాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కుందూరు దేవేందర్ రెడ్డి, విద్యార్థి నాయకుడు అరుణ్ యాదవ్ కోరారు.

దేవరకొండ ఆర్డీఓ బత్తుల వనజ రాణి బాధ్యతలు స్వీకరణ

అధికారులు చిత్తశుద్ధితో తమ విధులను కొనసాగించాలి

వనజ రాణి , దేవరకొండ ఆర్డీఓ



దేవరకొండ, నవంబర్ 06(జనంసాక్షి)

దేవరకొండ నూతన ఆర్డీఓ వనజ రాణి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీలలో భాగంగా నల్గొండలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ నుండి దేవరకొండ కు బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ సబ్ కలెక్టర్‌గా కరోలిన్ చింగ్తియాన్ మావి అస్సాం – మేఘాలయకు బదిలిపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయ సిబ్బంది నూతన ఆర్డిఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నూతన ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించుటలో అందరూ చిత్తశుద్ధితో తమ విధులను కొనసాగించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరేంతవరకు నిరంతరం తమ విధులను నిర్వర్తించాలని తెలిపారు.

సమస్యలపై సమ్మె నోటీసు అందించిన ఆశ వర్కర్లు

తుంగతుర్తి నవంబర్ 6 (జనం సాక్షి)

తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో డిసెంబర్ 15 నుండి ఆశా వర్కర్లు సమ్మె బాట పట్టనున్నట్లు బి ఆర్ టి యు ఆశ మండల అధ్యక్షులు మేకల జయమ్మ అన్నారు శుక్రవారం ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని లేనియెడల సమ్మెలో పాల్గొంటామని పేర్కొంటూ మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లింగమూర్తికి నిరవధిక సమ్మె నోటీసును అందజేసి మాట్లాడారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యల గుర్తించాలని అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ. 18,000/–లు పిక్స్డ్ వేతనం నిర్ణహించాలి. అదేవిదంగా వారికి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం మరియు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు, సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని లేని యెడల 2026 డిసెంబర్ 15 నుండి సమ్మెలోకి వెళతామని అన్నారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు 28 వేల మంది 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు . మీరంతా బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన మహిళలు అని అన్నారు, రూరల్ వెయ్యి మంది పట్టణంలో 2000 మంది నుండి 5000 మంది ప్రజలకు ఆశాలు సేవలందిస్తున్నారు గర్భిణీ స్త్రీలు డెలివరీ అయ్యేవిధంగా చూస్తూ తల్లి బిడ్డలకు ప్రాణాలను కాపాడడం కీలకపాత్ర పోషిస్తున్నారు, దీంతో పాటు సీజనల్ వ్యాధులు అంటువ్యాధులు దీర్ఘకాలిక వ్యాధుల నుండి అరికడుతున్నారు. కరోనా మహమ్మారి నుండి కట్టడి చేయడంలో ఆశలు కీలకపాత్ర పోషించామని అన్నారు,.డబ్ల్యూ సిహెచ్ఓ ఆశాలను గ్లోబల్ లీడర్స్ గా ప్రకటించింది ఉదయం 9 గంటల నుండి నాలుగు గంటల వరకు సబ్ సెంటర్ డ్యూటీలు ఏఎంసీలు పిఎన్సిలు టార్గెట్స్ ఎన్సీడీలు ఆన్లైన్ సర్వేలు స్కూట్అప్ డబ్బాలను మోయడం ఎగ్జామ్లో డ్యూటీలు డే బై డే ఫ్రైడే లెప్రసీ పోల్స్ పోలియో అనేక తదితర పనులను కూడా ఉదయం నుండి రాత్రి వరకు పనిచేస్తూ వెట్టిచాకిరి చేస్తున్నారని అన్నారు, ఇంత శ్రమ చేస్తున్న ఆశలకు నేటికీ రాష్ట్రంలో కనీస వేతనం లేదు కేవలం 9900 మాత్రమే అందుతున్నాయి అని అన్నారు, ఇతర సౌకర్యాలు లేవు మూడు సంవత్సరాల నుండి పారితోషకాలు పెరగలేదు. నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశం అంటుకుంటున్న కానీ వేతనంలో మార్పు లేదు పని భారం పెరిగి వచ్చే పారితోషకాలు సరిపోక ఆశలు అనేకమంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు తెలంగాణ రాష్ట్రంలో ఆశాల సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు నిరవధిక సమ్మె చేశారు ఈ సంఘ సందర్భంగా అక్టోబర్ 9న హైదరాబాదులో కోటి కమిషనర్ ఆఫీసు ముందు జరిగిన ధర్నా సందర్భంగా గత ప్రభుత్వం అనాటి అధికారులు నాయకులతో చర్చలు జరిపారు ఆశా సమస్యల పరిష్కారంతో కూడినటువంటి ఐఏఎస్ ల తో కూడిన ఓ కమిటీ వేస్తామని ఆ కమిటీ ఆశల సమస్యల కోసం పరిష్కారం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఎలక్షన్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు వేతనాలు పెంచుతామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఈఎస్ ఐ,పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులకు ఆశలు చేస్తున్న పోరాటంలో ప్రత్యక్ష పాల్గొని మేము అధికారంలోకి వస్తే మీరు అడిగిన డిమాండ్స్ అని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వమైనటువంటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆశలకు ఉన్న వేతనం 2వేల రూపాయకు కానీ కెసిఆర్ గారు వారి వేతనం ను 4 రెట్లు పెంచి 9900/–లు అందించటం జరిగింది తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచింది ఏమీ లేదని అన్నారు. ఈకార్యక్రమంలో బి ఆర్ టి యు నియోజకవర్గ అధ్యక్షులు గౌడ్ చర్ల సత్యనారాయణ గౌడ్, ఆశా మండల,ఉపాధ్యకులు రమ ప్రధాన కార్యదర్శి గాజుల నాగలక్ష్మి, యాకలక్ష్మి, సునీత, సరస్వతి ఆశాలు తదితరులు పాల్గొన్నారు.





వర్షాలకు నేలకొరిగిన వరి పంట

రైతుకు కాంగ్రెస్ నాయకుడు చలసాని రాజీవ్ ఆర్థిక చేయూత

నేరేడుచర్ల నవంబర్ 06 (జనంసాక్షి):

మున్సిపాల్టీ పరిధిలోని నర్సయ్యగూడెంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరి పంట నేలకొరిగి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. నర్సయ్యగూడెంకు చెందిన రైతు నన్నెపంగ రామలింగయ్య సాగు చేసిన ఎకరం వరి పంట పూర్తిగా నేలకొరగడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు.ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు చలసాని రాజీవ్ వెంటనే పంట పొలాన్ని సందర్శించి,వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. నష్టపోయిన రైతు రామలింగానికి తన వంతు సహాయంగా రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు.ఆపద సమయంలో రైతుకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన చలసాని రాజీవ్ స్థానికులు అభినందించారు.రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ధన్వంతరి జయంతి



నేరేడుచర్ల నవంబర్ 06(జనంసాక్షి):

పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి పూజలు నిర్వహించి,అనంతరం ప్రజలకు పండ్లు,పలహారాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ.ధన్వంతరి ఆయుర్వేద వైద్యానికి ఆద్యుడిగా ప్రసిద్ధి చెందారని, భారతీయ వైద్య సంప్రదాయంలో ఆయనకు విశిష్ట స్థానం ఉందని తెలిపారు.ప్రాచీన కాలం నుంచే నాయీ బ్రాహ్మణులు వైద్య సేవల్లో,ముఖ్యంగా ఆయుర్వేదం,శస్త్రచికిత్స సంబంధిత సంప్రదాయాల్లో తమదైన పాత్ర పోషించారని పేర్కొన్నారు.ధన్వంతరి ప్రాముఖ్యతను,ఆయన వైద్య వారసత్వాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు కాపర్తి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి జంపాల శ్రవణ్,గౌరవ అధ్యక్షులు మెగరాల సత్యనారాయణ,పయ్యావుల వెంకన్న,ఉపాధ్యక్షులు రసమల్ల కృష్ణ,తిరుమలగిరి నాగయ్య,నియోజకవర్గ యూత్ లీడర్ మిడిసినమెట్ల సతీష్,సమ్మెట వెంకన్న,రాంప్రసాద్,కార్తీక్,ఉపేందర్,కృష్ణ,వీరబాబు,ఉదయ్,మిడిసినమెట్ల నాగరాజు,నరేష్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కామేపల్లి మండలంలో కరువు సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్

జిల్లా కార్యదర్శి ఎన్ వి రాకేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రాన్ని కోరారు

కామేపల్లి,నవంబర్ 6(జనం సాక్షి):-

కమ్యూనిస్టు విప్లవోద్యమంలో దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ మండల సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్ అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజక వర్గం లోని కామేపల్లి మండలం పరిధిలోని గరిడేపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విప్లవ అమరవీరుల సంస్మరణ సభను ఘనంగా నిర్వహించి,వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరువు మండలంగా కామేపల్లి ని ప్రకటించి ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం పంటలకు ఎకరానికి ?50 వేలు,వాణిజ్య పంటలకు ?లక్ష, సాగు చేయని భూములకు ?30 వేల పరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి, రుణమాఫీతో పాటు తాగునీరు, పశుగ్రాసం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామోజీ వెంకటాచారి, రంగాచారి, రత్తమ్మ,దామా పిచ్చా తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల భద్రతపై నిర్లక్ష్యం తగదు

బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు న్యాయ అవగాహన



దేవరకొండ, నవంబర్ 06 (జనంసాక్షి):

చిన్నారులకు రక్షణ కల్పించడం, వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం సమాజంలోని ప్రతి ఒక్కరి కర్తవ్యమని మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి కె. అనిత అన్నారు. సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా దేవరకొండలోని ఎస్‌పీఆర్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు చట్టపరమైన అంశాలపై వివరించారు.బాల్య వివాహాలు చిన్నారుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. బాలలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు పోక్సో చట్టం ద్వారా కల్పిస్తున్న రక్షణను వివరించారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అన్యాయం జరిగినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. పిల్లల భద్రత విషయంలో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. ఉమామహేశ్వర్, కార్యదర్శి వనం జగదీశ్వర్, సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు, పాఠశాల డైరెక్టర్ వాస శ్రవణ్ కుమార్, ప్రిన్సిపాల్ చెన్నూరి లింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఆర్డిఓకు ఘన స్వాగతం

పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి

దేవరకొండ, నవంబర్ 06 (జనంసాక్షి):

దేవరకొండ నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన బత్తుల వనజా రాణిని శుక్రవారం దేవరకొండ మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్కను అందజేసి సాదరంగా స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. దేవరకొండ ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.





నాగారం నుంచి రంగాపురానికి

రాత్రంతా మట్టి తరలింపు.. కొనసాగుతున్న తవ్వకాలు..?

సార్ లు జర చూడండి..

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 06(జనంసాక్షి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నాగారం పాత క్రషర్ మిల్లు సమీపంలో గురువారం రాత్రి నుంచి జేసీబీలతో మట్టి తవ్వకాలు చేపట్టి లారీల ద్వారా రంగాపురానికి తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికీ ఈ పనులు కొనసాగుతున్నాయని పేర్కొంటున్నారు. తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన తవ్వకాల రుసుము చెల్లిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత లేదని చెబుతున్నారు. అనుమతులు ఉన్నప్పటికీ అర్ధరాత్రి వేళల్లోనే తవ్వకాలు ఎందుకు చేపడుతున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. జేసీబీల శబ్దం, లారీల రాకపోకలు, దుమ్ముతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ఉల్లంఘన ఉంటే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెన్షనర్స్ సేవాసదనం నిర్మాణానికి రూ.20 వేల విరాళం

రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏకుల రఘుపతి ఔదార్యం



దేవరకొండ, నవంబర్ 06 (జనంసాక్షి):

దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసదనం మొదటి అంతస్తు భవన నిర్మాణానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏకుల రఘుపతి రూ. 20 వేల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం సేవాసదనం నిర్మాణ నిధికి సంబంధించిన చెక్కును సంఘం ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళికి అందించారు.

ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ స్థానిక పెన్షనర్స్ సంఘం కార్యవర్గం చేస్తున్న సేవలు అభినందనీయమని, వారి సేవలతో పోలిస్తే తాను అందించిన ఆర్థిక సహాయం చాలా స్వల్పమని అన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడుతూ.. సేవాసదనం నిర్మాణానికి సంఘ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదని, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల నారాయణరెడ్డి, సహాధ్యక్షుడు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆకులపల్లి ఇజాక్, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, కార్యవర్గ సభ్యులు ముసిని వీరయ్య, మోటమర్రి పురుషోత్తం, జంపాల యాదగిరి, అలంపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొని దాతకు ధన్యవాదాలు తెలిపారు.

మున్సిపల్ కార్మికుడు మృతి



చిట్యాల, నవంబర్ 06 (జనంసాక్షి):

చిట్యాల మున్సిపల్ వర్కర్ గా పనిచేస్తున్న మిసాల కిషన్ (52) అకాల మరణం పట్ల సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.శుక్రవారం తమ పని ముగించుకుని ఇంటికి వెళ్ళిన కిషన్ ఆకస్మాత్తుగా కింద పడిపోగా హుటాహుటిన నార్కట్ పల్లి కామినేని హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం తీసుకుపోయినా మృతి చెందడం బాధాకరం అని అన్నారు.ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ నెల పదిహేను రోజుల వ్యవధిలోనే ముగ్గురు మున్సిపల్ కార్మికులలు వివిధ కారణాలతో చనిపోవడం దురదృష్టకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.కిషన్ కు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు అని తెలిపారు.వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పాల లక్ష్మయ్య,జన్నపాల జ్యోతి, బాకీ అండాలు, మేడి శోభ,జిట్ట నరేష్, రుద్రవరం నర్సింహా, మల్లేష్, అండాలు,పద్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

చౌటుప్పల్ మున్సిపాలిటీలో 33 ఫార్మా కంపెనీల

కాలుష్య కోరల్లో ప్రజల ప్రాణాలు

తక్షణమే చర్యలు తీసుకోవాలి : గోసుకొండ వెంకటేష్ డిమాండ్

చౌటుప్పల్ నవంబర్ 6(జనం సాక్షి)

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 33 ఫార్మా,కెమికల్ కంపెనీల నుండి వెలువడుతున్న తీవ్ర కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం, పంటలు, భూగర్భ జలాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షులు గోసుకొండ వెంకటేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చౌటుప్పల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న చౌటుప్పల్ ప్రాంతంలో అభివృద్ధి పేరుతో 33 ఫార్మా కంపెనీలకు అనుమతులు ఇచ్చి, కాలుష్య నియంత్రణను మాత్రం గాలికి వదిలేశారని ఆయన మండిపడ్డారు. రాత్రి వేళల్లో కంపెనీలు వదులుతున్న రసాయన వ్యర్థాల దుర్వాసనతో ప్రజలు ఊపిరి పీల్చలేకపోతున్నారని, ఇది అభివృద్ధి కాదు, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని ధ్వజమెత్తారు.

ప్రధానంగా ఎదురవుతున్న సమస్యలు:

భూగర్భ జలాలు విషతుల్యం: కంపెనీల నుండి వచ్చే రసాయన వ్యర్థాలను ఎలాంటి శుద్ధి చేయకుండా నేరుగా బయటకు వదులుతున్నారు. దీనివల్ల చౌటుప్పల్, దండు మల్కాపురం, తాళ్ల సింగారం, దేవలమ్మ నాగారం గ్రామాల్లో బోర్ల నీళ్లు రంగు మారి, దుర్వాసన వస్తున్నాయి. ఫ్లోరైడ్ మహమ్మారితో పాటు ఇప్పుడు కెమికల్ కాలుష్యం తోడైంది. రైతుల పంటలు నాశనం: కాలుష్య నీటి ప్రభావంతో వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిని ఎండిపోతున్నాయి. రైతులు పెట్టుబడులు కోల్పోయి లక్షల్లో నష్టపోతున్నారు. ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం: చిన్న పిల్లలు శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, కంటి మంటల బారిన పడుతున్నారు. వృద్ధులు రాత్రిపూట వచ్చే దుర్వాసనతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

ప్రభుత్వానికి ప్రధాన డిమాండ్లు:33 ఫార్మా కంపెనీలపై తెలంగాణ కాలుష్య నియంత్రణ



మండలి తక్షణమే సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు పాటించని కంపెనీల లైసెన్సులు రద్దు చేయాలి.ప్రతి కంపెనీలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జల్డ్) విధానాన్ని కచ్చితంగా అమలు పరచాలి.కాలుష్య ప్రభావిత గ్రామాల్లో ప్రభుత్వమే ఉచిత వైద్య శిబిరాలు, స్వచ్ఛమైన తాగునీటి పథకాలు ఏర్పాటు చేయాలి.చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఎలాంటి ఫార్మా కంపెనీలకు అనుమతులు ఇవ్వకూడదు. కాలుష్యంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు త్వరలోనే వినతిపత్రం అందజేస్తామని, ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గోసుకొండ వెంకటేష్ హెచ్చరించారు.



గ్రామ పరిశుభ్రతే ధ్యేయం ప్రజారోగ్యమే లక్ష్యం

కెప్టెన్ బంజారాలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

గ్రామ సర్పంచ్ ఆరెం అచ్చమ్మ ఆధ్వర్యంలో బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు

కామేపల్లి, నవంబర్ 6(జనంసాక్షి):

గ్రామపరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రజా ఆరోగ్యమేశ్రీ రామ రక్షకు నాంది అని పల్లెల్లో మురికి వాడలు, చెడు నీరు నిండి చెత్తతో ఉంటే ప్రజారోగ్యం హానికి సాధ్యమవుతుందని.కెప్టెన్ బంజారా గ్రామ సర్పంచ్ ఆరెం అచ్చమ్మ తెలిపారు. శుక్రవారం కామేపల్లి మండలం కెప్టెన్ బంజారా గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులు, డ్రెయిన్లు, బహిరంగ ప్రదేశాలలో వ్యాధులు వ్యాపించకుండా ముమ్మరంగా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.?అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షాకాలం, వాతావరణ మార్పుల నేపథ్యంలో దోమలు, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామపంచాయతీ తరఫున అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, మన గ్రామం ? మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది,వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



న్యాయసేవల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన న్యాయమూర్తి శివనాయక్

భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సన్మానం

భద్రాచలం నవంబర్ 06 (జనంసాక్షి)

భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి. శివనాయక్ నల్లగొండకు బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ప్రాంగణంలో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలంలో న్యాయమూర్తిగా పనిచేసిన కాలంలో సమర్థవంతమైన న్యాయపాలన అందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా శివనాయక్ కృషి చేశారని పలువురు సీనియర్ న్యాయవాదులు కొనియాడారు. పేదలకు న్యాయం చేరువ చేయడంతో పాటు న్యాయ విజ్ఞాన సదస్సులు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించారని ప్రశంసించారు. నిష్పాక్షిక తీర్పులు, సమయపాలన, న్యాయవాదులతో సమన్వయం ఆయన ప్రత్యేకతలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివనాయక్ మాట్లాడుతూ భద్రాచలంలో పనిచేసిన కాలం ఎంతో సంతృప్తినిచ్చిందని, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందించిన సహకారం, ఆత్మీయతను ఎప్పటికీ మరువలేనని భావోద్వేగంగా తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎ. దుర్గాభవాని, ఐటీడీఏ పీవో బి. రాహుల్, మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, భద్రాచలం సీఐ ఎస్. రాజు హాజరై శివనాయక్ సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తాతా లలిత, కోశాధికారి డి. రాము, కల్చరల్ సెక్రటరీలు కొరసా కృష్ణార్జునరావు, కొత్త మల్లేష్, లైబ్రరీ సెక్రటరీ పగడాల కవిత, లేడీ రిప్రజెంటేటివ్ ఎం. తరుణి, మాజీ అధ్యక్షులు కోటా దేవదానం, జయరాజు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



కల్లూరు నవంబర్ 06 (జనంసాక్షి)

మురాసు తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీటి ప్రభావంతో ముంపుకు గురైన ప్రాంతాలలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఇరిగేషన్ శాఖ అధికారులతోకలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ గృహాల నిర్మాణ ప్రాంతాలను సందర్శించి, వరదల కారణంగా ప్రభావితమైన కుటుంబాలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో ఎదురైన ఇబ్బందులు, ఇళ్లకు , నివాస ప్రాంతాలకు కలిగిన నష్టాలు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై బాధిత కుటుంబాల అభిప్రాయాలను తెలుసుకున్నారు.అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో వరద నీటి ప్రవాహం, నీటి నిల్వలు, ముంపునకు గల కారణాలు, డ్రైనేజీ వ్యవస్థ నీటి మళ్లింపు మార్గాలను పరిశీలించారు. భవిష్యత్తులో భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకతను అధికారులకు వివరించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు లకావత్ రంగమ్మ కన్నుమూత

కాంగ్రెస్ నాయకుల నివాళులు

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు

గ్రామ సర్పంచ్ బానోత్ కమల ,మాజీ సర్పంచ్ బానోత్ నీల



కామేపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి):

మండలంలోని గోవింద్రాల బంజారా జైత్రం తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు లకావత్ రంగమ్మ శుక్రవారం ఉదయం స్వర్గస్తులయ్యారు. ఆమె భౌతికదేహానికి కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు పూలమాలలు వేసి అశ్రునయనాల మధ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగమ్మ పార్టీకి అందించిన సేవలు మరపురానివని కొనియాడారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.?ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫతే మొహమ్మద్, ఏఎంసీ డైరెక్టర్ గబుర్ నాయక్, సర్పంచ్ కమలా దేవయ్య,మాజీ సర్పంచ్ నీలా నెహ్రూ,గ్రామ శాఖ అధ్యక్షుడు లక్కు లాలా,సీనియర్ నాయకుడు మంద ముత్యాలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కలెక్టర్, యంత్రాంగం కృషి అభినందనీయం: గుంటుపల్లి శ్రీనివాసరావు

- బేతుపల్లి చెరువులో 11 మందిని కాపాడటం సాహసోపేతం
- రెస్క్యూ ఆపరేషన్ విజయవంతంపై 'టీజీఈజేఏసీ' ప్రశంసలు



ఖమ్మం, (జనంసాక్షి) :

సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన ప్రమాదకర పరిస్థితుల్లో, గల్లంతైన మత్స్యకారులు మరియు వారిని రక్షించడానికి వెళ్లి చిక్కుకుపోయిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిపి మొత్తం 11 మంది ప్రాణాలను కాపాడిన రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం కావడం అభినందనీయమని టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఈ సాహసోపేత చర్యను విజయవంతం చేసిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ రోహిత్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ , అగ్నిమాపక సిబ్బంది మరియు జిల్లా యంత్రాంగం యొక్క సమన్వయ కృషిని టీజీఈజేఏసీ నాయకత్వం హృదయపూర్వకంగా అభినందించింది. ప్రమాదంలో చిక్కుకున్న వారి కుటుంబాల్లో ఆనందం నింపేలా అంకితభావంతో పనిచేసి, సకాలంలో స్పందించిన అధికారుల, సిబ్బంది ధైర్య సాహసాలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితిలో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జైపాల్, ఎర్రా రమేష్, వల్లపు వెంకన్న, తాళ్లూరి శ్రీకాంత్, చంద్రశేఖర్, రుక్మారావు, ప్రభాకర చారి పాల్గొన్నారు. అలాగే డాక్టర్స్ అసోసియేషన్ నుండి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ బాలకృష్ణ, అల్తాఫ్, ప్రవంతి, వైద్య ఉద్యోగ సంఘాల నాయకులు కృష్ణారావు, వేణుగోపాల్, రమణ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

తక్కువ తూకంతో సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్

○బియ్యం, కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

○నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 6 కేసులు నమోదు..

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 06 (జనంసాక్షి)

వినియోగదారులకు సరుకులను నిర్ణీత తూకం కంటే తక్కువగా విక్రయిస్తూ మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు.సివిల్ సప్లై కమిషనర్ శ్రీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని బాబుక్యాంప్, పెద్దబజార్ ప్రాంతాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు బియ్యం దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాలను తూకం వేయగా, 26 కిలోలుగా పేర్కొన్న బస్తాల్లో కేవలం 25





కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై మొత్తం 6 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కూచన మనోహర్ మాట్లాడుతూ, ప్రతి వ్యాపారి ప్యాకింగ్ చేసిన సరుకులపై నికర బరువును స్పష్టంగా ముద్రించాలని, ప్రకటించిన బరువుకు అనుగుణంగానే వినియోగదారులకు సరుకులు విక్రయించాలని సూచించారు. బస్తాలపై పేర్కొన్న బరువు కంటే తక్కువగా సరుకులు విక్రయించినా, తూనికలు, కొలతల నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వినియోగదారులు సైతం సరుకులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ముద్రించిన నికర బరువును, తూకాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. వ్యాపారులు నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని, వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి తెలిపారు.

మద్యం కోసం డబ్బులివ్వలేదని మనస్తాపం.. గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

- నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆస్పత్రిలో కన్నుమూత

భద్రాచలం నవంబర్ 06 (జనంసాక్షి)

మద్యం వ్యసనం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. మద్యం తాగేందుకు కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వలేదనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి, మద్యం మత్తులో పొలాల్లో వినియోగించే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన అతడు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన బట్టు వెంకట్రావు (40) తన అన్న బట్టు బాబూరావు నిర్వహిస్తున్న పంచర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అయితే కొంతకాలంగా మద్యానికి బానిసైన వెంకట్రావు, సంపాదించిన డబ్బులను కుటుంబానికి ఇవ్వకుండా మద్యానికే ఖర్చు చేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో తీవ్ర మద్యం మత్తులో ఇంటికి వచ్చిన వెంకట్రావు, తాను గడ్డి మందు తాగినట్లు భార్య చైతన్యకు తెలిపి కుప్పకూలిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అతడిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదనే కారణంతోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి అన్న బట్టు బాబూరావు ఫిర్యాదు మేరకు భద్రాచలం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలం నవంబరు 06 (జనంసాక్షి)

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణం భక్తుల కనులపండువగా, వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా అర్చకులు విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామివారికి వేద ఆశీర్వచనం అందించారు. సంప్రదాయబద్ధంగా సాగిన కల్యాణ వేడుకతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో నిండిపోయింది.



దీపంలా ఒక్కటైన విద్యార్థులు.. సురక్షిత దీపావళే త్రివేణి ఆకాంక్ష

హ్యాపీ అండ్ సేఫ్ దీపావళికి పిలుపు

ఖమ్మం, (జనంసాక్షి) :

దీపావళి పండుగను పురస్కరించుకుని ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో ముందస్తు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ కలిసి పాఠశాల ఆవరణలో దీపం ఆకారంలో నిలబడి అందరినీ ఆకట్టుకున్నారు. చేతులు పైకెత్తి “హ్యాపీ అండ్ సేఫ్ దీపావళి” అంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సురక్షితంగా, పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలని సందేశమిచ్చారు.ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ పండుగలను ఆనందంతో పాటు సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని జరుపుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ విద్యార్థుల సృజనాత్మకతను అభినందిస్తూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్



స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

○మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినా తప్పని ఇబ్బందులు..

○విద్యుత్ సంస్థ విచారణ తీరుపై ఉద్యోగ వర్గాల్లో చర్చ!

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 06 (జనంసాక్షి):

న్యాయం కోసం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన ఓ విద్యుత్ ఉద్యోగికి విచారణ పేరుతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై సమగ్ర విచారణ జరపాల్సింది పోయి, ఫిర్యాదు చేసిన బాధితుడి వివరాలపైనే అధికారులు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారనే విమర్శలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ సంస్థ పరిధిలో చర్చనీయాంశంగా మారాయి.బాధితుడి చుట్టూనే విచారణ..వేధింపులకు గురయ్యానంటూ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన సహాయ సహాయ ఇంజనీర్ ఫిర్యాదుపై విచారణ కొనసాగుతోంది. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న విభాగ ఇంజనీర్ పాత్రను పరిశీలించాల్సింది పోయి, ఫిర్యాదుదారుడి గత విధులు, ఆయనతో పనిచేసిన సిబ్బంది, వినియోగదారుల వివరాలను సేకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిందిత అధికారిపై విచారణ ఏది..?

ఫిర్యాదుదారుడిపైనే విచారణ ఎందుకు..?

దీంతో అసలు ఫిర్యాదులోని అంశాలపై విచారణ జరుగుతోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాక్షుల ఎంపికపై అభ్యంతరాలు!విచారణలో భాగంగా బాధితుడు గతంలో పనిచేసిన ఉపవిభాగ సిబ్బంది, సహోద్యోగులు, వినియోగదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న విభాగ ఇంజనీర్ పరిధిలో పనిచేసిన సిబ్బంది వాంగ్మూలాలను కూడా సమానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అన్ని కోణాల్లో విచారణ జరగకపోతే వాస్తవాలు ఎలా వెలుగులోకి వస్తాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఎంఆర్‌టీ దస్త్రంపై ‘విభాగ ఇంజనీర్ తరఫున’ సంతకం చర్చనీయాంశం! మరోవైపు విభాగ ఇంజనీర్ పరిధికి సంబంధం లేని ఎంఆర్‌టీ విభాగానికి చెందిన దస్త్రంపై ‘విభాగ ఇంజనీర్ తరఫున’ అంటూ సంతకం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికార పరిధి, అనుమతులు, నిబంధనలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.ఒత్తిళ్ల ఆరోపణలపై స్పందించాలి!విభాగ ఇంజనీర్ల సంఘం పేరుతో, కొందరు ఉన్నతాధికారుల అండతో ఫిర్యాదుదారుడిపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంది. విచారణలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.ప్రధాన కార్యనిర్వహణ సంచాలకుడు జోక్యం చేసుకోవాలని ఉద్యోగుల విజ్ఞప్తి!మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన ఉద్యోగి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని విద్యుత్ ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి. ప్రస్తుత విచారణ తీరును విద్యుత్ సంస్థ ప్రధాన కార్యనిర్వహణ సంచాలకుడు సమీక్షించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల పాత్రతో పాటు విచారణ అధికారుల వ్యవహారశైలిపైనా సమగ్ర పరిశీలన జరిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.ఫిర్యాదుదారుడి వాదనతో పాటు ఆరోపణలు



ఎదుర్కొంటున్న అధికారుల వివరణకు కూడా అవకాశం కల్పిస్తూ, సాక్షులందరి నుంచి సమానంగా వివరాలు సేకరించినప్పుడే విచారణపై విశ్వసనీయత ఏర్పడుతుంది. న్యాయం కోసం కమిషన్‌ను ఆశ్రయించిన ఉద్యోగికి నిష్పక్షపాత విచారణ ద్వారా న్యాయం అందుతుందా? అన్నది వేచి చూడాలి.

కష్టపడితేనే యువత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుంది



- వన్ టౌన్ సీఐ సాదిక్ పాషా, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేత జాగర్లమూడి రంజిత్ కుమార్
- శ్రీ దివ్య జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి మోడల్ పరీక్ష

ఖమ్మం, (జనంసాక్షి):

యువత నిరంతరం శ్రమిస్తే సాధించలేనిది ఏదీ లేదని, పట్టుదలతో కష్టపడితే సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వన్ టౌన్ సీఐ సాదిక్ పాషా, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు, న్యాయవాది జాగర్లమూడి రంజిత్ కుమార్ పేర్కొన్నారు.స్థానిక వన్ టౌన్ పరిధిలోని శ్రీ దివ్య జూనియర్ కళాశాలలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐజఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మోడల్ పరీక్షకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత పరీక్షా పత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశ సమగ్ర అభివృద్ధిలో యువశక్తి పాత్ర అత్యంత కీలకమైనదని తెలిపారు. ప్రస్తుత యువత రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచి దేశ భవిష్యత్తును సరికొత్త దిశగా నడిపించాలని ఆకాంక్షించారు. “మనం ఏ స్థితిలో జన్మించామన్నది ముఖ్యం కాదు.. ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగామన్నదే ముఖ్యం” అనే ఆలోచనతో విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాల్సిన గురుతర బాధ్యత ప్రతి యువకుడిపై ఉందన్నారు. నేటి యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, సన్మార్గంలో పయనిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు మద్దోజు శ్రావణ్ కుమార్, జిల్లా నాయకులు భీమేష్, రఫీ, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.



పినపాక మండలంలో జాబ్ కార్డుల కోసం గ్రామసభలు

పినపాక, నవంబర్ 06(జనంసాక్షి):

పినపాక మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో వివిజి రామ్ జీ జాబ్ కార్డుల దరఖాస్తుల స్వీకరణకు గ్రామసభలు నిర్వహించారు. పినపాక ఎంపీడీఓ సంకీర్త్ ఆదేశాలతో జాబ్ కార్డులు లేని వారికి కొత్త కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడంతో పాటు, ప్రస్తుత కార్డుల్లో పేర్ల చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను తీసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామసభలో సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన అంగన్వాడి కేంద్రం

స్లాబు పెచ్చులు కూలిపోతున్న వైనం

కామేపల్లి, నవంబర్ 6(జనంసాక్షి):



కామేపల్లి మండల పరిధిలోని రుక్కీ తండా గ్రామపంచాయతీ రాయి గూడెం గ్రామం లో ఉన్న అంగన్వాడి కేంద్రం శిథిలావస్థలో ఉండి కూలిపోయే దశకు చేరింది.ఈ కేంద్రంలో ప్రీస్కూల్ విద్యతో పాటు.కేంద్రానికి వచ్చే గర్భిణీలు బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారు.ఇట్టి విషయమై పలుమార్లు ఉన్నత అధికారులకు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం జరగలేదు. ఇప్పటికైనా తక్షణమే అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవలసిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.ఈ విషయమై రుక్కి తండ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ రమాదేవి ని వివరణ కోరగా రాయిగూడెం అంగన్వాడి కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.ఇట్టి విషయమై ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య కి విన్నవించడం జరిగినది. త్వరలోనే నూతన భవనానికి అనుమతులు వస్తాయని ఆమె పేర్కొన్నారు.

తుల్జా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే బాలు నాయక్

- అమ్మవారి ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి.. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

పి.ఏ.,పల్లినవంబర్ 06(జనంసాక్షి):



పి.ఏ.పల్లి మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పాలపాటి తండాలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ తుల్జా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తుల్జా భవానీ అమ్మవారి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని,దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యత,భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి,డీసీసీ జిల్లా కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,వీరబోయిన ఎల్లయ్య యాదవ్,పాల్వాయి వెంకట్ రెడ్డి,సర్పంచులు మేగావత్ కిషన్ నాయక్,వంగాల శ్రీనివాస్ రెడ్డి,నేనావత్ అనిత లక్ష్మణ్ నాయక్, రమావత్ దస్రు నాయక్,మెగావత్ రాజు,మెగావత్ బన్సీలాల్,మెగావత్ సంగు,మెగావత్ శ్రీరామ్ నాయక్,కొర్ర బాలకృష్ణ చౌహన్,రామావత్ జగన్ నాయక్,రామావత్ రవి నాయక్,రామావత్ రాజా నాయక్, రామావత్ భగవాన్ నాయక్,ఆంగోతు బోడా నాయక్,ఏకుల వెంకటయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొరంపల్లి బంజర్ నుంచి లండన్ అంతర్జాతీయ వేదికపైకి

- ఒకే చిత్రానికి తొమ్మిది అవార్డులు..

- కేటీపీఎస్ ఉద్యోగి శనగ రవీంద్రబాబు అరుదైన ఘనత..

బూర్గంపహాడ్ నవంబర్ 06 (జనంసాక్షి)



పల్లెటూరిలో పుట్టిన ప్రతిభకు ప్రపంచ వేదికపై గుర్తింపు లభించింది. ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే తనలోని సృజనాత్మకతకు పదును పెట్టిన మొరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన శనగ రవీంద్రబాబు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఆయన రూపొందించిన ‘చఏడీఎస్’ లఘుచిత్రం లండన్ అంతర్జాతీయ సినీ అవార్డుల వేదికపై ఏకంగా తొమ్మిది విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర్‌కు చెందిన రవీంద్రబాబు ప్రస్తుతం కేటీపీఎస్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచే సినిమాలపై, కథా రచన, దర్శకత్వం, చిత్ర నిర్మాణంపై ఆసక్తి పెంచుకున్న ఆయన ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తూనే తన అభిరుచిని ఆచరణలో పెట్టారు. పరిమిత అవకాశాలను సవాలుగా తీసుకుని స్వీయ ప్రతిభతో లఘుచిత్రాన్ని రూపొందించి అంతర్జాతీయ వేదికకు చేర్చారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రదర్శితమైన ఆయన చిత్రం ప్రేక్షకులు, సినీ అభిమానుల ప్రశంసలు అందుకోగా, తాజాగా లండన్ అంతర్జాతీయ సినీ అవార్డుల్లో తొమ్మిది విభాగాల్లో గుర్తింపు పొందడం విశేషం. ఉత్తమ కథ, ఉత్తమ లఘుచిత్రం, ఉత్తమ కథనం, ఉత్తమ ఎడిటింగ్, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఛాయాగ్రాహకుడు, ఉత్తమ తెలుగు చిత్రం, ఉత్తమ ఉత్కంఠభరిత చిత్రం, ఉత్తమ చిత్ర నిర్మాత విభాగాల్లో అవార్డులు సాధించారు.ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం.. మరోవైపు సినిమాపై మక్కువతో అంతర్జాతీయ స్థాయిలో తొమ్మిది పురస్కారాలు.. రవీంద్రబాబు ప్రయాణం ఔత్సాహిక కళాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. మారుమూల గ్రామం నుంచి మొదలైన ఆయన సృజనాత్మక ప్రయాణం లండన్ వేదికపై గుర్తింపు పొందడం బూర్గంపాడు మండలానికే గర్వకారణంగా మారింది.రవీంద్రబాబు సాధించిన ఈ విజయంపై మొరంపల్లి బంజర్ గ్రామస్థులు, మిత్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యభరిత చిత్రాలు రూపొందించి తెలుగు సినీ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

బాణసంచా దుకాణాల నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

హుజూర్‌నగర్ నవంబర్ 6 (జనంసాక్షి):

దీపావళి పండుగను పురస్కరించుకొని తాత్కాలిక బాణసంచా దుకాణాల నిర్వహణ, అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై స్థానిక ఫైర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుబ్బారామిరెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా దుకాణాల నిర్వాహకులతో సమావేశమై పలు భద్రతా సూచనలు చేశారు. దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన ప్రాంగణంలోనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనల ప్రకారం రేకుల షెడ్లు నిర్మించుకోవాలని సూచించారు. నిప్పు త్వరగా అంటుకునే స్వభావం కలిగిన వస్తువులను దుకాణాల పరిసరాల్లో ఉంచరాదని స్పష్టం చేశారు. అలాగే విద్యుత్ వైర్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి సౌకర్యంతో పాటు ఇసుక, మంటలను ఆర్పే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. దుకాణాల్లో బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదని హెచ్చరించారు. ప్రతి దుకాణ నిర్వాహకుడు అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు పాటించాలని, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బాధ్యతాయుతంగా వ్యాపారాలు నిర్వహించాలని ఎస్ఐ సుబ్బారామిరెడ్డి సూచించారు.



ఫోటో, వీడియో గ్రాఫర్స్ సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే బాలు నాయక్

అసోసియేషన్ నూతన కమిటీకి శుభాకాంక్షలు

దేవరకొండ, నవంబర్ 06 (జనంసాక్షి):



దేవరకొండ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు, చారిత్రక ఘట్టాలను భవిష్యత్ తరాలకు గుర్తుండేలా భద్రపరచడంలో ఫోటో, వీడియో గ్రాఫర్ల సేవలు అభినందనీయమన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. వారి సంక్షేమానికి అండగా ఉంటానని, అసోసియేషన్‌లోని పేదవారు, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పున్న శైలజ, వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, మారుపాకుల సురేష్ గౌడ్, హనుమంతు వెంకటేష్ గౌడ్, ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు కలరు సందీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి రామావత్ గోపాల్, కోశాధికారి సూగురి మంజునాద్, కమిటీ నూతన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ లో ప్రజా గర్జన

○ ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయాలి

○ పోటు రంగారావు పిలుపు



ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 6 (జనంసాక్షి)

మోడీ, అమిత్ షాల బీజేపీ, ఆర్ఎస్ఎస్ సర్కార్ ప్రజల ప్రాథమిక పౌర ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, ఓట్ చోరీకి, సంపద చోరీకి, సంసద్ చోరీకి, జిందగీ చోరీకి పాల్పడుతున్నది. దేశభక్తి, దైవభక్తి మాటున దేశద్రోహకర విధానాలకు పాల్పడుతున్నదన్నారు . కీలక వనరులను, ఖనిజాలను, ప్రభుత్వ ఆస్తులను, పరిశ్రమలను తమ గుజరాతీ, బీహారులైన ఆదానీ, అంబానీలకు కారు చౌకగా కట్టబెడుతున్నదన్నారు . ఎల్.ఐ.సి., ఐఓబీఐ, ఇతర రంగాలను దేశ, విదేశీ కార్పోరేట్ కంపెనీలకు అమ్మివేసిందనీ,13 కోట్ల 40 లక్షల మంది పౌరుల ఓట్లు తొలగించి, చొరబాటుదారులంటూ దొంగ కబుర్లు చెబుతున్నది. తొలగించిన వారిలో 3 వేల మందిని మాత్రమే వలసదారులని ఎన్నికల కమిషన్ చెప్పిందన్నారు.. ప్రజలు శతాబ్దాలుగా పోరాడి సాధించుకున్న ప్రాథమిక హక్కులు, కార్మిక, కర్షక హక్కులు, ఇతరత్రా దళితులు ఆదివాసుల, పేదల హక్కులను కాలరాస్తున్నది. దేశంలో పౌరులు మాట్లాడే పరిస్థితి, అడిగే పరిస్థితి లేకుండా చేస్తున్నదన్నారు . ఈ ఫాసిస్టు విధానాలకు, అణచివేత విధానాలకు వ్యతిరేకంగా, తీవ్ర నిరసన తెలపాలని పౌర సమాజాన్ని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ కోరుతున్నదని రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలియజేశారు.అలాగే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో వాగ్ధానాలు చేసింది. ఒకటి, రెండు పథకాలు అరాకొరా అమలు చేసింది తప్ప, అమలుకు పూనుకోలేదన్నారు. మూడేండ్ల పాలన గడిచినా కబుర్లతోనే కాలం గడుపుతున్నదన్నారు. పెన్షన్లు పెంచాలని, కార్మికులకు ఇచ్చే చేయూత పథకం అమలు చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, ఉపాధి హక్కు పథకాన్ని 250 రోజులకు పొడిగించి వేతనం 700 రూ?లు ఇవ్వాలని, పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు బకాయిలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 42 వేలు రూ?లు ఇవ్వాలని, ఉద్యోగ ఖాళీలను నింపాలని, వ్యవసాయ కార్మికులకూ చేయూత పథకం అమలు చేయాలని, పేద రైతులు, కౌలు రౌతులకూ చేయూత పథకం అమలు చేయాలని, కరువు సహాయ చర్యలు చేపట్టాలని, మహిళలకు నెలకు రూ.2500 లు ఇచ్చే హామిని అమలు చేయాలని, ఆటో కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు సం?రానికి రూ.12,000 ఇచ్చే హామిని అమలు చేయాలని తదితర డిమాండ్లతో డిసెంబర్ 29వ తేదీన 'ప్రజా గర్జన' పేరుతో ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ తెలంగాణా రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. భారీ ప్రదర్శన, బహిరంగ సభ వుంటుంది. ప్రజలు, ప్రజాస్వామికవాదులు పాల్గొనాలని కోరుతున్నామన్నారు .

కరువు, వరద సహాయ చర్యలు చేపట్టాలన్నారు

రాష్ట్ర మంతటా కరువు తాండవం చేస్తుందన్నారు . కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తూ, మాటలు చెపుతూ కాలం వెళ్ళబుచ్చకుండా తక్షణమే విపత్కర పరిస్థితి కింద కరువు సహాయ చర్యలు చేపట్టాలన్నారు. మంచినీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు. వంట నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి పనులు పెంచాలన్నారు. అలానే అకాల తుఫాను వర్షం వలన భద్రాద్రి, ఖమ్మం తదితర జిల్లాలలో కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటలు నష్టపోయారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి శాస్త్రీయంగా అంచనా వేయాలన్నారు . పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.అలానే కరువు, వర్షం వలన నష్టపోయిన రైతుల అప్పులను రద్దు చేయాలన్నారు .ఈ ప్రెస్ మీట్లో సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య, మలీదు నాగేశ్వరరావు, బండెల వెంకయ్య, కోలేటి నాగేశ్వరరావు, కమ్మకొమటి నాగేశ్వరరావు, ఝాన్సీ, శోభ, కె శ్రీనివాస్, లాల్మియా, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెల కనీసం 35 వేల మెట్రిక్ టన్నుల బియ్యం డెలివరీ చేయాలి

అదరపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 06(జనంసాక్షి)

జిల్లాలో రబీ 2024-25, ఖరీఫ్ 2025-26 సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యం డెలివరీని వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సివిల్ సప్లైస్ కమిషనర్ కార్యాలయ జీఎం రాజేందర్, డీజీఎం ఇర్ఫాన్ లతో కలిసి సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీ, మిల్లర్ల వారీగా బియ్యం సరఫరా పురోగతి, బకాయి బిల్లుల చెల్లింపులపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రబీ 2024-25, ఖరీఫ్ 2025-26 సీజన్లకు సంబంధించిన పెండింగ్ సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు వెంటనే సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బియ్యం డెలివరీ పూర్తి చేసేందుకు ప్రతి మిల్లర్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యం సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించ వద్దని, గడువులోగా బియ్యం అందించని మిల్లర్లను నిబంధనల ప్రకారం డిఫాల్ట్ మిల్లర్లుగా పరిగణించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పెండింగ్ నిల్వలను ఎప్పటి కప్పుడు తగ్గించుకుంటూ, సివిల్ సప్లైస్‌కు బియ్యం సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.

మిల్లర్ల బకాయి బిల్లులను త్వరితగతిన చెల్లించాలి:× మిల్లర్లకు చెల్లించాల్సిన మిల్లింగ్ ఛార్జీలు, రవాణా ఛార్జీలకు సంబంధించిన బిల్లులను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసి సంబంధిత అధికారులకు సమర్పించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఏ ఒక్క బిల్లు కూడా పెండింగ్‌లో ఉంచకుండా, బిల్లుల పరిశీలన, ఆమోదం, తదుపరి చెల్లింపుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.మిల్లర్లకు రావాల్సిన అన్ని రకాల పెండింగ్ చెల్లింపులను త్వరితగతిన క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జీఎం రాజేందర్ కు తెలిపారు. బియ్యం డెలివరీ లక్ష్యాలను సాధించడంతో పాటు మిల్లర్లకు రావాల్సిన బకాయిల చెల్లింపుల్లో కూడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేస్తూ సీఎంఆర్ బియ్యం డెలివరీని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, వారానికి నిర్దేశించిన పురోగతిని సాధించేలా నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

సివిల్ సప్లైస్ కమిషనర్ కార్యాలయ జీఎం రాజేందర్ మాట్లాడుతూ× రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఎంఆర్ బియ్యం డెలివరీ పెండింగ్ లో 18 లక్షల మెట్రిక్ టన్నులు సివిల్ సప్లైస్‌కు చేరాల్సి ఉందని తెలిపారు. పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీని వేగవంతం చేసేందుకు ప్రతి జిల్లాలో సమావేశాలు నిర్వహిస్తూ సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లాలో మొత్తం 1.25 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం డెలివరీ పెండింగ్‌లో ఉండగా, అందులో 1.06 లక్షల మెట్రిక్ టన్నులు సివిల్ సప్లైస్‌కు అందించాల్సి ఉందని తెలిపారు. సివిల్ సప్లైస్‌కు పెండింగ్‌లో ఉన్న 1.06 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జనవరి 31, 2027లోగా తప్పనిసరిగా అందించాలని మిల్లర్లకు సూచించారు.ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతి నెల కనీసం 35 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ప్రతి వారం సీఎంఆర్ డెలివరీ పురోగతిపై సమీక్ష నిర్వహించి, మిల్లర్ల వారీగా సరఫరా వివరాలను పరిశీలిస్తామని, నిరంతరం ఫాలోఅప్ చేస్తామని వెల్లడించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డిఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, రైస్ మిల్లర్లు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మణుగూరు ఏరియా ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం..



మణుగూరు,నవంబర్ 06 (జనంసాక్షి):

పినపాక నియోజకవర్గం లో కంటి సమస్యలతో బాధపడుతూ, కంటి ఆపరేషన్లు చేయించుకోవాలనుకునే రోగుల కోసం నేడు (శనివారం) ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు మణుగూరు ఏరియా హాస్పిటల్ నందు ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించబడుతుందని ఆస్పత్రిలమిక్ ఆఫీసర్ జి. సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిబిరానికి పినపాక నియోజకవర్గం లోని గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం, పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపహాడ్ మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయబడతాయని ఆపరేషన్లకు ఎంపికైన రోగులు తమ ఆధార్ కార్డు రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కోరారు.కంటి సమస్యలు ఉన్న రోగులందరూ నిర్ణీత సమయానికి ఏరియా హాస్పిటల్‌కు చేరుకుని పరీక్షలు చేయించుకోవాలని కోరారు.


దీపావళి బాణసంచా దుకాణాలను తనిఖీ చేసిన డీఎస్పీ



మణుగూరు నవంబర్ 06 (జనంసాక్షి):

బాణాసంచాల దుకాణాల సముదాయంలో నిర్లక్ష్యం వహిస్తే నిండు ప్రాణాలతో పాటు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని మణుగూరు సబ్ డివిజనల్ అధికారి వంగ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు పట్టణంలోని నేతాజీ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల వద్ద తీసుకున్న జాగ్రత్తలను తనిఖీ చేసి యజమానులకు పలు సూచనలు చేశారు.బాణసంచా దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని దుకాణ యజమానులకు రవీందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పార్టీ నాగబాబు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గారపాటి మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం



ఖమ్మం నవంబర్ 6 జనంసాక్షి

కేటీపీఎస్ రిటైర్డ్ ఫోర్‌మెన్ గారపాటి సోమేశ్వరరావు మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే సోమేశ్వరరావు కుమారుడు డాక్టర్ మురళికి ఫోన్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో మురళి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావుతో తనకున్న అనుబంధాన్ని నామ గుర్తు చేసుకున్నారు. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో వాకర్స్ తరఫున ప్రతిరోజూ గ్రౌండ్‌లోని మొక్కలకు బకెట్లతో నీరు పోయడంతో పాటు, అనేక సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొనేవారని కొనియాడారు. సోమేశ్వరరావు మృతి వారి కుటుంబానికి, సేవా రంగానికి తీరని లోటని నామ పేర్కొన్నారు.

మురసు తుఫాన్ నష్టంపై రైతులకు పరిహారం చెల్లించాలి

మాజీ వైస్ ఎంపీపీ నరుకుల్ల సత్యనారాయణ



పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన భారత రాష్ట్ర సమితి నాయకులు

చంద్రుగొండ, నవంబర్ 6 (జనంసాక్షి):

మురసు తుఫాన్ కారణంగా చంద్రుగొండ మండలంలో తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను భారత రాష్ట్ర సమితి నాయకులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ రూపంలో విరుచుకుపడిన ప్రకృతి విపత్తుతో నష్టపోయిన రైతులను పరామర్శించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.మండల మాజీ ఉప మండల పరిషత్ అధ్యక్షుడు నరకుళ్ల సత్యనారాయణ, మాజీ మండల ప్రధాన కార్యదర్శి చీదెళ్ల పవన్, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు సూరా వెంకటేశ్వర్లు నేతృత్వంలో నాయకులు పలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతులకు ముందస్తు హెచ్చరికలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఒకవైపు సాగునీరు అందక, మరోవైపు విద్యుత్ కోతలు, ఎరువుల కొరతతో రైతులు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అప్పులు చేసి, ఎన్నో కష్టనష్టాలకోర్చి సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోవడం బాధాకరమన్నారు.రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమవుతోందని విమర్శిస్తూ, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలను వెంటనే అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రైతులను ఆదుకోవడంలో జాప్యం చేయకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మాజీ రైతు సమన్వయ సమితి సభ్యుడు నరుకుళ్ల వాసు, ఓరుగంటి రాములు, నరుకుళ్ల అప్పాజీ, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి తలారి నాగరాజు, కుంచపు కన్నయ్య, తంబళ్ల మంగయ్య, నరుకుళ్ల రాఘవరావు, పెంబుల సతీష్, కొండా వంశీ, యలమందల శేఖర్, నరుకుళ్ల వెంకటరామారావు, దండుగుల అప్పారావు, నల్లగొండ బసవయ్య, ఆళ్లకుంట రాము, కంపసాటి లక్ష్మయ్య, వంకాయలపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ గవర్నెన్స్‌పై జిల్లా స్థాయిలో సమగ్ర శిక్షణ

జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 06 (జనంసాక్షి):

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్ కార్యక్రమంలో భాగంగా, జిల్లా స్థాయిలో అధికారుల పాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు మాడ్యూల్స్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి హాజరై ప్రారంభించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు, ఆర్థిక శాఖ ద్వారా రాష్ట్ర స్థాయిలో సెక్రటరీలు, శాఖాధిపతులకు పూర్తయిన శిక్షణకు కొనసాగింపుగా ఈ క్యాస్కేడింగ్ శిక్షణను జిల్లాలోని డిడిఓలు, అధికారులకు అందించారు. జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాస్ రెడ్డి, డిస్ట్రిక్ట్ పీఏఓ కె. రామ్ లు డీడీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు దాదాపు 650 మంది అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి మాట్లాడుతూ, ఉద్యోగి నియామకం మొదలుకొని పదవీ విరమణ వరకు అపాయింట్మెంట్, ప్రమోషన్, లీవ్స్, బదిలీలు వంటి అన్ని రకాల సర్వీస్ వివరాలు ఇకపై పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లోనే జరుగుతాయన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల అంచనాలు, సాంకేతిక మంజూరు, కాంట్రాక్ట్ ఒప్పందాలు, పని పూర్తయ్యే ప్రక్రియ వరకు అంతా ఆన్‌లైన్‌లో పర్యవేక్షించబడుతుందని తెలిపారు.శిక్షణలో ఇచ్చిన మూడు డిజిటల్ మాడ్యూల్స్ అమలుతో ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెరుగుతుందని, ఫైళ్ల జాప్యం తగ్గి ఉద్యోగులకు, ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల అధికారులు ఈ డిజిటల్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైరా ఏటీఓ ప్రసన్నకుమార్, ఎస్టివోలు మోదుగు వేలాద్రి, నాగేంద్ర కుమారి, మధిర వెంకటేశ్వర్లు, సునీల్, విజయ సారధి, పీఏఓ సూపరింటెండెంట్ రాధికా రెడ్డిలతో పాటు జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది, వివిధ సబ్ ట్రెజరీల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన

పెనుబల్లి నవంబర్ 6 (జనంసాక్షి)

విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండాలని పెనుబల్లి తహసీల్దార్ వీరభద్ర నాయక్ అన్నారు. పెనుబల్లి మండల కేంద్రంలోని రమేష్ స్కై స్కూల్ లో శుక్రవారం విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. సర్ విస్తరణ, ఎమ్మెల్సీలను పెద్దల సభకు పంపేందుకు నిర్ణీత సమయంలో డిగ్రీ పూర్తి చేసుకున్న పట్టభద్రుల ఓట్ల నమోదు గురించి ఈ సందర్భంగా వివరించారు. భారత రాజ్యాంగం ప్రకారం అర్హులైన ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెన్స్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య

కుటుంబంలో విషాదం



కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 6, జనంసాక్షి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నగరం కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. నగరం కాలనీకి చెందిన బానోత్ రాము (తండ్రి: కంతు) మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, రాము భార్య శైలజ గత సుమారు 10 నెలలుగా తన పుట్టింటిలో ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రాము ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. మృతుడు రాముకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరికి 8 సంవత్సరాలు, మరొకరికి 5 సంవత్సరాల వయస్సు ఉంది. కుటుంబానికి ఏకైక కుమారుడైన రాము మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ చేయూత

ఆత్మకూర్ (ఎం) నవంబర్ (6) జనంసాక్షి

మండలం లో ని కొరటికల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన సయ్యద్ బీర్ జాన్ బీ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. ఫౌండేషన్ తరఫున బీర్ల అనిత 50 కేజీల బియ్యాన్ని కుటుంబ సభ్యులు సయ్యద్ అంజాత్, సయ్యద్ సాజిత్, సయ్యద్ అన్నులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టోకోల సుశీల హనుమంతు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కందటి అనంతరెడ్డి, ఉపసర్పంచ్ మామిడి నర్సిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీరాముల ఋషి, దేవస్థాన కమిటీ చైర్మన్ మురారి శెట్టి సురేష్ గుప్తా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ మజీద్, వార్డు సభ్యుడు రాగటి యాదగిరి గౌడ్, చామకూర ఉపేందర్, చిన్నం లక్ష్మయ్య, దంతూరి దేవయ్య, సయ్యద్ సాదక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ బలిదానాలు కొనసాగుతూ ఉంటే పాలకులు సిగ్గుపడాలి : బత్తుల సోమయ్య

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 6 (జనంసాక్షి)

కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఇంకా ఆత్మ బలిదానాలు ఆగడం లేదంటే పాలకులు సిగ్గ పడాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య అన్నారు. ఇటీవల జనగామా జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ప్రముఖ తెలంగాణ ఉద్యమ కారుడు, పీఏసీఎస్ డైరెక్టర్ వేముల లక్ష్మణ్ గౌడ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడం తమను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పలువురు ఉద్యమకా రులతో వెళ్లి పరామర్శించారు. అనంతరం బత్తుల సోమయ్య మాట్లాడుతూ విద్యార్థులు, మేధావులు, సామా న్యులు సైతం ప్రత్యేక తెలంగాణ కోసం అనేక త్యా గాలు చేశారని, మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు మనకే దక్కాలనే ఏకైక లక్ష్యంతో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే ఆ ఫలాలు కొద్ది మందే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంకోసం సర్వం కోల్పోయిన అనేకులు పన్నెండేళ్ల పాటు ఎదురు చూసినప్పటికీ ఎలాంటి ఫలితంలేకపోవడంతో నిరాశ చెంది.., చేసిన అప్పులు తీర్చుకోలేక ఇలా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని సోమయ్య అన్నారు. గత పాలకులకు గానీ నేటి పాలకులకు గానీ చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత అని చెప్పుకుంటున్న పెద్దమనిషి కెసిఆర్, కానీ ఆత్మహత్య లకు ఉసిగొల్పిన హరీష్ రావు గాని, హోటళ్ళు, ఫార్మహౌస్ లు కట్టుకుని ఊరేగుతున్న కేటీఆర్ కే ఈ ఆత్మహత్యల పాపం తగలక మానదని అన్నారు. వీళ్ళు పదేళ్లలో ఉద్యమకారులకు చేసిందేమో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియంత పాలనను తరిమి కొట్టి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అయినా న్యాయం చేస్తుందని భావించి కాంగ్రెస్ కు పట్టంగడితే వాళ్లుకూడా అదే బాటలో పయనిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ధనాన్ని కాళేశ్వరం పేరుతో దోచుకుంటే నేడు రేవంత్ రెడ్డి కూడా తన స్వ లాభం కోసం కుటుంబ ఆస్తులను పెంచుకుంటున్నాడని బత్తుల అన్నారు. మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ, అందాల పోటీల పేరుతో లక్షల కోట్ల రూపాయలను కాజేస్తున్నారని ఆరోపించారు. ఈ చావులకు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, రేవంత్ రెడ్డిలే బాధ్యత వహించాలని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే 2024లో కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకు ఉద్యమాలు కొత్తేమి కాదని రానున్న రోజుల్లో అన్ని సంఘాలను కలుపుకుని ప్రత్యేక కార్యాచరణను ప్రకటిస్తామని, మరో ఉద్యమానికి తెరలేపక ముందే ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా సోమయ్య నేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



లక్ష్మణ్ గౌడ్ కు ఘన నివాళి

ఆత్మహత్య కు పాల్పడిన లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి ఎంమ్మెల్సీ కోదండరాం, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తో కలసి బత్తుల సోమయ్య, తెలంగాణ ఉద్యమకారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం :

వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించెందుకు ఖమ్మం జిల్లా నుంచి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. రానున్నారోజుల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టీ యు జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఓరుగంటి ఆనంద్, రాష్ట్ర ప్రధాన కారదర్శి కొణతం యాదగిరి రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు కుక్క సత్యం, అంగిడి బిక్షం, తునికిపాటి లక్ష్మణ చారి, బొలికొండ పాపయ్య, పొలాస సోమయ్య, గడ్డం యాదగిరి, వడ్త్యా రాజేష్ నాయక్, కాశబోయన యాకయ్య, గుగులోత్ మంగీలాల్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'బిగ్ హెల్ప్' సంస్థ ఆధ్వర్యంలో
పాఠశాల అభివృద్ధి, గోల్డెన్ స్టార్ అవార్డుల పంపిణీ

జాజిరెడ్డిగూడెం (జనం సాక్షి):

అర్వపల్లిలోని పీఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ ను బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నట్లు ఆ సంస్థ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి పాఠశాల హెచ్ఎం పి. మల్లేష్ చెప్పారు. పాఠశాలలోని విద్యార్థులకు ఎఫ్ ఏ -2 పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి తరగతికి 10 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 50 మంది విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో గోల్డెన్ స్టార్ అవార్డులను పంపిణీ చేశారు. బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులను చదివిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ స్టార్ అవార్డు డైరెక్టర్ బి విమల, స్పోర్ట్స్ కోచ్ ఇమామ్ పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో
మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

చింతలపాలెం(జనంసాక్షి)



దీపావళి పండుగ సందర్భంగా చింతలపాలెం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ నెల 8వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు చింతలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి ఎస్సై పి. పరమేష్, సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి ప్రారంభకులుగా హాజరుకానున్నారు.పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.6000,రెండో బహుమతిగా రూ.4000, మూడో బహుమతిగా రూ.2000 నగదు పారితోషికంతో పాటు షీల్డులు అందజేయనున్నారు. మండలంలోని క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఫ్రెండ్స్ యూత్ నిర్వాహకులు కోరారు.



జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమ్మె ఉధృతం
-గుర్రంపోడు అధికారులకు వినతిపత్రం అందజేత

గుర్రంపోడు, నవంబర్ 6, (జనంసాక్షి)

రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని ఒప్పంద, బాహ్య వనరుల ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా ఉమ్మడి కార్యాచరణ సమితి పిలుపు మేరకు చేపట్టిన నిరవధిక సమ్మె నేటితో 25వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా గుర్రంపోడు మండల పరిధిలోని ఉద్యోగులు ఈరోజు ఆశ నోడల్ అధికారి పి. పుల్లమ్మ, పర్యవేక్షకురాలు ఆర్. విజయలను కలిసి తమ డిమాండ్లతో కూడిన సమ్మె వినతిపత్రాన్ని అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నా ప్రభుత్వం తమ హక్కులను, ఉద్యోగ భద్రతను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 12 వరకు 14 రోజుల పాటు నల్ల బ్యాడ్జీలతో శాంతియుత నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే అక్టోబర్ 13 నుండి విధులను బహిష్కరించి సమ్మెకు దిగాల్సి వచ్చిందని వారు స్పష్టం చేశారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతన సవరణ సంఘం జీతాలు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఆరోగ్య కార్డులు మరియు మహిళా సిబ్బందికి 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవుల ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బంది సమ్మెతో స్థానిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ తనిఖీలు, గర్భిణుల సంరక్షణ, ప్రయోగశాల పరీక్షల వంటి సేవలకు ఆటంకం ఏర్పడుతోందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్చలు జరపకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గుర్రంపోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో టీ. ఇందిర, వీ. వెంకటమ్మ, కే. సాలమ్మ, వీ. సుజాత, బీ. హారతి, ఎం. సునీత, పీ. రత్నకుమారిలతో పాటు మండలంలోని ఆరోగ్య సహాయకులు (ఏఎన్ఎంలు), తదితరులు పాల్గొన్నారు.

రూ. 2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్‌సీ పంపిణీ

జాజిరెడ్డిగూడెం(జనంసాక్షి):

జాజిరెడ్డిగూడెం మండలం కోదూరుకు చెందిన లగిశెట్టి పెదవెంకయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరగా వైద్యఖర్చుల కోసం రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా అదే గ్రామానికి చెందిన చెంచల భాస్కర్ చొరవతో రూ.2.50 లక్షలు సీఎంఆర్ఎఫ్ ఎల్‌సీ మంజూరు చేయించి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంగి సత్యనారాయణ, లగిశెట్టి సోమయ్య, ఎస్.సాయికుమార్, మన్నె సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా సుధా బ్యాంక్
రూ. 5.39 లక్షల ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెక్ అందజేత



కోదాడ,(జనంసాక్షి):

బాధిత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఇన్సూరెన్స్ ఎంతగానో తోడ్పడుతుందని సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ పేర్కొన్నారు. కోదాడ సుధా బ్యాంక్ బ్రాంచ్‌లో 2023లో గృహ రుణం తీసుకున్న బానోత్ హతీరామ్ అనే వ్యక్తి ఇటీవల అక్టోబర్ నెలలో ప్రమాదవశాత్తు మరణించారు. రుణానికి సంబంధించి ఉన్న ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ. 5,39,000/- ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెక్‌ను మృతుడి భార్య బానోత్ సరితకు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ శుక్రవారం అందజేశారు. అనంతరం ఎండీ పెద్దిరెడ్డి.గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. చిన్న మొత్తంతో ఇన్సూరెన్స్ చేసుకోవడం ద్వారా జీవితానికి,తమ కుటుంబానికి కొండంత భద్రత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంక్ మేనేజర్ చెన్నూరు రవి కుమార్,బ్యాంక్ సిబ్బంది భుస్సా నాగ మహేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుండి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె
గుర్రంపోడు అధికారులకు వినతి పత్రం అందజేత

గుర్రంపోడు, నవంబర్ 06, (జనంసాక్షి)

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపులో భాగంగా గుర్రంపోడు మండల కేంద్రంలో ఆశా వర్కర్లు సమ్మె నోటీసు అందజేశారు. వైద్యాధికారితో పాటు ప్రత్యేకంగా ఆశా నోడల్ అధికారి పి. పుల్లమ్మ, సూపర్‌వైజర్ ఆర్. విజయలకు యూనియన్ నాయకులు ఈ నోటీసును సమర్పించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో డిసెంబర్ 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించారు. ఆశా వర్కర్లకు నెలకు రూ. 18,000/- ల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, ఉద్యోగ భద్రతతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.గత 20 ఏళ్లుగా 28 వేల మంది ఆశాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తున్నారని, కరోనా సమయంలో వీరి సేవలను ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం కొనియాడిందని నాయకులు గుర్తుచేశారు. ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు సబ్ సెంటర్ డ్యూటీలు, ఏఎన్ఎం, పల్స్ పోలియో లాంటి అదనపు విధులు నిర్వహిస్తున్నా, నేటికీ వీరికి ఫిక్స్డ్ వేతనం లేదన్నారు. కేవలం రూ. 9,900/- ల అరకొర పారితోషికం ఇస్తున్నారని, ఐదేళ్లుగా ఇవి పెంచకపోవడంతో పెరిగిన ధరల వల్ల ఆశాల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2023లో 15 రోజులు సమ్మె చేసినప్పుడు ఐఏఎస్ అధికారుల కమిటీ వేస్తామని ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు యమ్ డి . హఫీజా, కె. నాగమణి, పి. యేషమ్మ, జి. జయమ్మ, . యమ్ డి .సైదాభి, ఎస్. పూలమ్మ, ఎ. దుర్గ, ఎ. వజ్రమ్మ, జి. పద్మ, పి. విజయ, పి. చెన్నమ్మ, కె. మహేశ్వరి, ఎమ్. ఎల్లమ్మ, బి. సరిత, వి. లక్ష్మి, ఇ. అందాలు, జి. అలవేలు, కె. అనిత, ఎన్. లక్ష్మి, ఎమ్. ఇందిర, బి. ప్రభావతి, డి. రజిత, పి. శ్రీలత, ఎమ్. జయమ్మ, వి. పద్మ, బి. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌లో
'మిషన్ త్రిబుల్ ఆర్' సదస్సు-రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

గుర్రంపోడు, నవంబర్ 06 (జనంసాక్షి)



గుర్రంపోడు మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో రోడ్డు భద్రతే ధ్యేయంగా "మిషన్ త్రిబుల్ ఆర్" (రోడ్ సేఫ్టీ - రెస్పాన్సిబిలిటీ - రైట్ బిహేవియర్) లో భాగంగా గ్రామ రోడ్డు భద్రత కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. నల్గొండ ప్రధాన కార్యాలయ (హెడ్ క్వార్టర్స్) అధికారి తాజ్ వెంకటేశ్వర్లు మరియు స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) వెంకన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సమావేశంలో అధికారులు ముఖ్యంగా "మిషన్ త్రిబుల్ ఆర్" యొక్క ప్రాధాన్యతను మరియు అందులోని ప్రతి 'ఆర్' యొక్క అర్థాన్ని ప్రజలకు వివరించారు. మొదటి 'ఆర్' అనగా రోడ్ సేఫ్టీ (రోడ్డు భద్రత), దీని ముఖ్య ఉద్దేశం ప్రయాణికుల ప్రాణ రక్షణే మొదటి లక్ష్యంగా రోడ్డుపై వెళ్లే ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరడానికి అవసరమైన భద్రతా ప్రమాణాలను పాటించడం. రెండవ 'ఆర్' అనగా రెస్పాన్సిబిలిటీ (బాధ్యత), రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల పని మాత్రమే కాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తించి హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించడం. మూడవ 'ఆర్' అనగా రైట్ బిహేవియర్ (సరైన ప్రవర్తన), వాహనం నడిపేటప్పుడు రోడ్డుపై క్రమశిక్షణతో ప్రవర్తిస్తూ మద్యం సేవించి వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వాడకపోవడం, వేగ పరిమితి దాటకుండా ఉండటం మరియు పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వడం అని అధికారులు స్పష్టం చేశారు."సురక్షిత ప్రయాణం - సుఖమయిన జీవితం" సాధ్యం కావాలంటే ఈ మూడు సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, వాహన నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఇందులో పాదచారులు, యువత మరియు గ్రామ ప్రజలందరి భాగస్వామ్యం ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. "రోడ్డు భద్రత... ప్రతి ఒక్కరి బాధ్యత" అని గుర్తిస్తూ ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వాహనదారులు, విద్యార్థులు, గ్రామ భద్రత కమిటీ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల రద్దుకు సర్పంచుల డిమాండ్!

◆కమిటీ చైర్మన్లుగా ప్రజలచే ఎన్నికైన సర్పంచులనే నియమించాలి

◆కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పెత్తనం ఏంటి?

◆మండల సర్వసభ్య సమావేశంలో ప్లకార్డులతో సర్పంచుల నిరసన



సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 6. (జనంసాక్షి):

ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేసి, వాటి స్థానంలో గ్రామ పంచాయతీలకు ప్రజలచే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులను చైర్మన్లుగా నియమించాలని సంస్థాన్ నారాయణపురం మండల సర్పంచులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను జోడించి తెలంగాణ లోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోంది. ప్రజల పన్నుల రూపంలో సమకూరుతున్న ప్రభుత్వ నిధులతో అమలవుతున్న సంక్షేమ పథకంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల ఓట్లతో గెలుపొందిన గ్రామ సర్పంచులకు బాధ్యతలు, అధికారాలు కల్పించకుండా, ప్రజలచే ఎన్నుకోబడని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఇందిరమ్మ కమిటీల చైర్మన్లుగా నియమించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజల తీర్పును అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో స్థానిక సర్పంచులకు తప్పనిసరిగా భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామంలో నిజంగా ఇల్లు లేని నిరుపేదలు ఎవరు? ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఏవి? అనే విషయాలపై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన స్థానిక సర్పంచులకు ఉంటుందని తెలిపారు. అలాంటప్పుడు ప్రజలచే ఎన్నుకోబడని వ్యక్తులతో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి, అధికార పార్టీ కార్యకర్తలకు కమిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో స్థానిక సర్పంచుల ప్రమేయం లేకుండానే అధికార పార్టీకి చెందిన వ్యక్తుల సిఫార్సులతో, ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి, ఆర్థికంగా బలంగా ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన నిరుపేదలకు అన్యాయం జరగకుండా అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందిన సొంత ఆస్తులు కావని, అవి ప్రజాధనంతో అమలవుతున్న పథకాలని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులను పక్కనపెట్టి రాజకీయ కార్యకర్తల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలు జరపడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు.కాబట్టి ప్రభుత్వం వెంటనే ప్రస్తుత ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి, గ్రామ సర్పంచులనే కమిటీ చైర్మన్లుగా నియమిస్తూ కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని మండల సర్పంచులు డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సర్పంచులు ఆంగోత్ రాజు నాయక్, వీరేశం గౌడ్, సుర్వి సౌజన్య రాజుగౌడ్, ఉప్పల రమేష్ గౌడ్, రామ్ నరసయ్య, బీరయ్య, కురిమిద్ద వినోద్ తదితరులు పాల్గొన్నారు.



అమరగాని వరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

చిలుకూరు,నవంబర్ 06(జనంసాక్షి):

మండల కేంద్రానికి చెందిన అమరగాని వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వరమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అక్కినపల్లి జానకి రామాచారి,పిఏసిఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, బెల్లంకొండ నాగయ్య, మాజీ గ్రంథాలయ చైర్మన్ అంబాల వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

విబిజి రామ్ జి పథకం ద్వారా కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

ఈ నెల 10న కలెక్టరేట్ల ఎదుట సీపీఐ ధర్నాలు



చిలుకూరు, నవంబర్ 06(జనంసాక్షి):

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వి.బి.జి. రామ్ జి పథకం ద్వారా కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజువారీ వేతనం రూ.700 చెల్లించాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన వ్యవసాయ కూలీలకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే పెన్షన్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. భారీ వర్షాలతో నష్టపోయిన వరి, పత్తి రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాళ్లూరి పెద్ద మల్లయ్య, వ్యవసాయ కూలీలు బత్తిని పుల్లమ్మ, నాయిని వెంకటమ్మ, బెల్లంకొండ వీరస్వామి, నాగటి శీను, సీతయ్య, బంగారు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ వికాసంపై నిద్రమత్తు వదలని యంత్రాంగం

తక్షణమే అమలు చేయాలి!

ఎమ్మార్పీఎస్ మండల నాయకుల హెచ్చరిక

మాడుగులపల్లి నవంబర్ 6 (జనం సాక్షి):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ వికాసం పథకం క్షేత్రస్థాయిలో నాన్చివేత ధోరణికి నిదర్శనంగా మారిందని ఎమ్మార్పీఎస్ మాడుగులపల్లి మండల అధికార ప్రతినిధి చెరుకుపల్లి సైదులు స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రభుత్వ పిలుపు మేరకు పథకం ద్వారా లబ్ధి పొందేందుకు నిరుద్యోగులు, అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకుని ఆశగా ఎదురుచూస్తున్నారని, కానీ అప్లై చేసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు పథకం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో చెప్పే నాథుడే కరువయ్యాడని ధ్వజమెత్తారు మండల స్థాయిలో ఉన్న ఏ అధికారిని అడిగినా మాకేమీ తెలియదు అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానాలు దాటవేస్తూ ప్రజలను తీవ్ర అయోమయానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులను ఈ పథకం పురోగతిపై ప్రశ్నిస్తే,మాకు దాని గురించి ఎలాంటి సమాచారం లేదు అని తప్పించుకునే ధోరణి ప్రదర్శించడం శోచనీయమన్నారు అధికారుల, ప్రజాప్రతినిధుల ఈ నిర్లక్ష్య వైఖరి వల్ల అర్హులైన లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు ఇప్పటికైనా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు పథకం అమలుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసి, రాజీవ్ వికాసాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాలని కోరారు లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



దర్గా(ఉర్సు) వద్ద 24 గంటల ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు

జాజిరెడ్డిగూడెం (జనం సాక్షి):

అర్వపల్లి పర్వత శ్రేణుల మధ్య ఉన్న ప్రసిద్ధ హజ్రత్ సయ్యద్ ఖాజా నసిరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం 24 గంటల పాటు ఉచిత ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ తెలిపారు. సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అనారోగ్యానికి గురయ్యే భక్తులకు తక్షణమే ఉచితంగా అత్యవసర వైద్య సేవలు అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో డ్యూటీలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలతో పాటు అత్యవసర మందులను సిద్ధంగా ఉంచామన్నారు. ?ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, హెల్త్ సూపర్వైజర్లు లలిత, గౌతమి, దుర్గమ్మ, సైదమ్మ, శకుంతల, శ్వేతలతో పాటు ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే సునీత మహేందర్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి :

మండలం లో ని కోరటికల్ గ్రామం మధిర ఇప్పల్ల ఖాజా నసిరుద్దీన్ బాబా చిల్లా ముబారక్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోల సత్తయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నరకుడు బిందెల సైదులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోలిపురం లక్ష్మారెడ్డి, మండల సెక్రటరీ సోలిపురం రామ్‌రెడ్డి, , పల్లెపహాడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాలే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

